తల్లిప్రాణం

"చెప్పినమాట విను" అన్నాడు రామబ్రహ్మం.

బుజ్జగించి లోపుచేసుకుందా మని అతని ప్రయత్నం; కాని, పురుషుని అహంకారమూ, యజమాని అధికారమూ స్ఫుటంగానే ధ్వనించా యామెకి, ఆమాటలతో.

"నేను విననండీ" అంది భద్రమ్మ తలతాటించుకుంటూ.

ఇంకా వూరుకుంటే విషమిస్తుందని తోచినప్పుడు స్త్రీలు కనపరిచే పట్టుదలా ప్రతిఘటనా స్పష్టంగానే వున్నా యామాటలో.

వాటికి మెరుగు పూద్దా మని ప్రయత్నించనే లే దామె.

పై పెచ్చు, నిర్లక్ష్య భావమూ కనపరిచింది. నిర్మొగ మాటంగా.

ఇడవరలో రెండుమూడు మాట్లీ ప్రస్తావన రాకపోలేదు; కాని, తెలివిగా మాట తప్పించేస్తూ వచ్చిం దామె.

అయినా అత నూరుకోకపోడం చూసి యెవరో అతణ్ణి రెచ్చగొడుతున్నారని గుర్తించుకుంది.

కనక, యెప్పటి కయినా యిది తప్పనిదే, తనకి.

అంచేత, దీని అంతు చూడా లని నిశ్చయించుకుంది.

ఈనిశ్చయంతో యిలా యెదురుకుంది, చివరికి.

ఇందులో పెంకితనం కనపడకపోలే దతనికి.

అయినా, వెనక్కి తగ్గలే దతను.

ఇందులో తనకూ బాధ్యత వుందని ఆమెకి తెలియబరచాలన్నవుద్దేశంతో అందుకున్నాడు, మెల్లిగా.

"అలా కాదు, కొంచెం నిదానించు, దీనివల్ల యేమీ లాభం లేదని నీకే తెలుస్తుంది."

"చదువుకుంటే లాభం లేదని మీరు కనక అనగలిగిగారు, వూరుకోం దీపాటికి."

"శిరోమణి పరీక్ష యిచ్చిన మొగరాజులకే దిక్కూదివాణమూ లేకుండా వున్న దినా లివి. అమ్మాయి విద్వా నయితే—"

"అయితే, అంటూ సందేహం కూడానా?"

"లేదు, అవుతుందే అను, నీమాట యెందు క్కాదనాలి? అయితే, అది వుద్యోగం చేస్తుందా వూళ్ళేలుతుందా?"

"చెయ్యకపోడానికీ యేలకపోడానికీ తెలివితక్కువదా, చేతకానిదా చిట్టితల్లి?"

"అది కాదు నేను చెప్పేది—"

"మరేమి టండీ?"

"........"

"కాక, — ఉద్యోగం కోస మేనా చదువు?"

"చెప్పే దేమిటో—"

"ఉద్యోగం చేయిద్దా మనే చదువుచెప్పించారు మీ నాయనా, మానాయనా మీకు. ఏం చెయ్యగలిగారు, మీరు?"

".........."

"మీరే కాదు. బి.యేలూ ఎం.ఏలూ కూడా లక్షమంది మొగపిల్లలు దేవుళ్ళాడుతున్నారు, వుద్యోగాలు దొరక్క, మరి, చదువులు మానుకున్నారా వారిని చూసి తరవాతి వాళ్ళు?"

"దాని కవసరం యేమి టని అడుగుతున్నాను నేను, తెలుసా?"

"అంటే?"

"అది తప్పు, మన కిప్పటి కింకెవరూ లేరుగదా, వున్న దంతా సుఖంగా అనుభవించక నౌఖరీ కర్మం యేమిటీ అమ్మాయికి?"

"అధీనం తప్పితే అత్తవారు విడిపికొట్టే మనోవర్తి డబ్బులకు తప్ప, ఎంత వుండినా పుట్టింటివారి ఆస్తిలో అధికారం యేదీ ఆడపిల్లకి?"

"................"

"పోనీ, అనుభవించడానికే పెట్టిపుట్టిందా నాచిట్టితల్లి?"

ఇలాంటి మర్మాఘాతం సంభవిస్తుం దనుకోలే దతను.

నోరు నొక్కేసిన ట్టయిపోయింది, దీంతో.

"చేతులారా దాని గొంతుకు పిసికేశారు కాని, కాస్త అయినా తరువాయి అట్టేపెట్టారా మీరు మీఅమ్మాను?" అంటూ ఆమే అందుకుంది, చూసిచూసి.

". . . . ."

"మొగుడు చస్తే చచ్చాడు, చదువనీ పుస్తకా లనీ పత్రికలనీ సభలనీ— ఆసందట్లో పడయినా కాలం వెళ్ళబుచ్చుకోడానికి—"

"కాలమే వెళ్ళబుచ్చుకోవాలంటె, అందుకు లక్షమార్గాలు."

"వాటిలో యిదొకటి, తెలుసా?"

గభీ మని మాట తోచకపోవడమే మంచి దయిం దతనికి

ఈవ్యధానంలో కొత్తదారి కనపడింది.

"మాటకి మాట అనెయ్యడమే గొప్ప అనుకోకు. దాని కోసం డబ్బుఖర్చు పెట్టటం యిష్టం లేక నే నిలా అంటున్నా ననికూడా అనుకోకు. ఇనప్పెట్టి తాళాలు దానికే యిచ్చేస్తాను. నాకేం కావలసినా దాన్నే అడుగుతాను. అది యిస్తేనే పుచ్చుకుంటాను."

"ఉపోద్ఘాతం చాలు, అస లేమిటో చెప్పండి"

"తీర్థయాత్రలు, దినాని కోనోము, సంతర్పణలు, సమారాధనలు—"

"ఏం, ఆగారేం?"

"సంసారం అంతా అదే నిర్వహించేస్తుంది. మరి, వివరాలెందుకూ?"

"ఎవరి సంసారం?"

తల యెగరవేసుకుంటూ ఆమె ఇలా అడిగాటప్పటికి వులిక్కి పడి పోయా డతను.

"బుర్ర కూడా — " అంటూ మాట నాన్చేసిం దామె; కాని, అంత మాత్రానికే కొండవిరిగి మీద పడ్డ ట్టయిం దతనికి.

జుట్టుతీయించేసుకునీ, సైనుపంచె కట్టుకునీ తన కూతురు తనయింటోనే వంటలక్క అయివుండినట్టున్నూ అనిపించింది.

కాళ్ళల్లో వొణుకు పుట్టింది, దీంతో.

మనస్సు చెదిరిపోయింది.

ఇది గుర్తించి "మేనరికం వద్దో అని నే నెంత మొత్తుకున్నా, నాకీ మొగుడు వద్దు మొర్రో మంటూ అదెంత గోలపెట్టినా మొండికెత్తి దాని బతుకింతకి తెచ్చారు మీరు. పుట్టిన వొక్క బిడ్డా మోడయిపోయి అలో లక్ష్మణా అంటూ యేడుస్తూ వుంటే జాలి లేదూ మీకు? కనికారం పుట్టదూ?"

"..........."

"దుఃఖం యెరుగరూ మీరు?"

గిర్రున నీళ్ళు తిరిగా యతని కళ్ళల్లో.

ఆమెకేసి చూడలేకపోయాడు, ఆవాలకంతో.

"అంత చక్కని పిల్ల మరొక్కర్తి వుందా భూమ్మీద? దాని తెలివితేటలకు హద్దూపద్దూ వున్నాయా? దాని వొబ్బిడీ, దాని నిదానమూ. దాని ఆరిందాతనమూ యేమయిపోనూ? దాని ఆశలు నిరాశలయి, దాని బతుకు బగ్గం పాడయిపోవలసిందేనా?"

చెవులు గింగుర్లెత్తిపోయా యతనికి.

"నే నెందుకు చూస్తున్నానో కాస్త పరకాయించుకోండి చదువుసంధ్యలబ్బాయి కనకనే ఆమంచితనమూ అబ్బింది దానికి. చదువే లేకపోతే — మీ యింటి ఆడబడుచది — మీ అక్కలాగ కజ్జాకో రయిపోయి వుండును. గుర్తించుకోండి"

తన అక్క సంగతి బాగా తెలిసివుండ దనకున్నా డామెకి.

తెలిసివుండినా యిప్పుడు మరిచిపోయి వుంటుం దనీ అనుకున్నాడు.

కాగా, దీంతో తెల్లబోయాడు.

అదిన్నీ గ్రహించేసిందామె.

అతనికి "నసాళం అంటిం" దనుకుంది.

"ఇక పరవాలే"దనిన్నీ నిశ్చయించుకుంది.

"మంచిమాటాడి పంపేద్దాం" అని దయతలచింది, చివరికి.

"మంకుపట్టు పట్టానని మీరు బాధపడనక్కరలేదు. ఇది తప్ప మీరేమి చెప్పండి వింటాను. ఇదివర కల్లా వినలేదు టండీ" అనడిగింది, లాలనగా.

తేరుకున్నా డతను, దీంతో.

"ఈవొక్క మాటా కూడా వినకూడదూ?" అందా మనుకున్నాడు.

మాట నాలుక చివరికి వచ్చేసింది కూడా; కాని "నామాట వినడం నామోషీ అనుకున్నారేమో మీరు. తల్లిమాటా వేరే గంపెడు సంసారం నిర్వహించుకుంటున్న అక్కమాటా వినడం కంటే తప్పు కాదు, చేసుకున్న పెళ్ళాం మాట వినడం" అందామె, చురచుర చూస్తూ, అంతలో.

కూతురుకి పెళ్ళిప్రయత్నాలు చేసినప్పుడు తల్లికే కాదు అక్కకి తాను బానిస అయిపోయి వుండడం జ్ఞాపకం వచ్చిం దతనికి.

అప్పుడు కూతు రేడవడమూ, అందుకు జాలిపడి "నువ్వు మనిషివి కావూ?" అంటూ యిరుగు పొరుగూ తనని నిరసించడమూ, అయినా, తాను హృదయం రాయిచేసుకోవడమే కాక, భద్రమ్మని దాసీదానికంటె నికృష్టంగా చూడడమూ— ఇదిన్నీ జ్ఞాపకం వుం దతనికి.

తన మొండితనమే యింతకి తెచ్చిం దని బోధపడిం దతనికి; కాని, వయసు వచ్చిన సుందరవితంతువు — సయానా తన యేకపుత్రిక — పుణ్యస్త్రీవేషం వేసుకు తిరగడమూ, పెద్ద పెద్ద చదువులూ చదువుతూ సభలకు వెళ్ళి పురుషుల మధ్య కూచుంటూ వుండడమూ — ఇవన్నీ జ్ఞాపకం వచ్చి మళ్ళీ అభిమానం అందుకుం దతనికి.

కాగా "మరొకటీ మరొకటీ అయితే — " అంటూ యేమో అనబోయా డతను; కాని "మరొకటీ మరొకటీ కాక మరేమిటీయిదీ?" అంటూ ఝుమాయించి అడిగిందామె, మాట సగంలోనే అందుకుని.

మళ్ళీ తెల్లబోయాడు.

మాటే ఆడలేకపోయాడు.

ఆమె మాత్రం వూరుకోలేదు.

"అమ్మాయి జోలి మీ కక్కరలేదు. ఆడవాళ్ళ కష్టసుఖాలు మొగవాళ్ళ కర్థం కావు. చావలేక బతికివున్నాను నేను. ఏడవ లేక నవ్వుతున్నాను, ఎదురొమ్ముమీద కుంపటిలాగ అమ్మాయిని భరించేదాన్ని నేను, మీకేం తెలుస్తుందీ?"

ఒక్క దెబ్బతో అష్టోత్తరశతంగా ఓంకారనాదం చేసే గంట అయిపోయిం దీమాటతో అతని చెవి.

"ఒక్కనాడు మీరింటో లేకపోతే— వొక్కపూట మీరు కనపడకపోతే —ముప్పయ్యేళ్ళు నిండిన నేనే యెలాగో అయిపోతాను గదా, మొన్ననే పదిహేడేళ్ళు నిండిన పిల్ల అమ్మాయికి వైరాగ్యం కలగాలని మీరెలా అనిస్తున్నారండీ?"

మనస్సు గుబగుబలాడిపోయిందతనికి.

"పోనీ—— మీమాట చెప్పండి. నాతో మాట్టాడకుండా వుంటారా మీరు? నాకూడా కూడా తిరగడం మానుకుంటారా నాకేసి చూడ్డం కూడా పనికిరాదు, కట్టిపెట్టేస్తారా?"

ఇలా అడుగుతూ చురుగ్గా కూడా చూసిందామె.

ఆ చూపులు భరించలేకపోయాడతను.

"గుర్రం దిగు ఈపాటి" కంటూ జబ్బపట్టుకుని యెవరో దిగ గుంజేసి నట్టున్నా కాగా, మాట్టాడలేకపోయాడతను

అతనేదో వాకటి అనగలిగితే యేమిటేమిటో అనేసునామె; కాని అతని మౌనం విసుగు పుట్టించింది.

మరో క్షణం కూడా యెదురుచూసింది.

"ఒక్కదానికి బదులు చెప్పకపోతే యేంజేతునమ్మా నేనూ?" అందామె, చేతులు తిప్పుకుంటూ చివరికి.

పూర్తిగా చిత్తయిపోయివున్నా డతను; కాని దీంతో వూపిరాడింది, మెల్లిగా.

నిర్లక్ష్యంగా యెదురుకుని, నిర్మొగమాటంగా నిలవతీసిన్నీ, వుండివుండి చివరి కిలాగ ఆమె స్త్రీ సహజమైన ధోరణిలో పడిపోయాటప్పటికి పౌరుషం రేకెత్తిందతనికి.

అయినా దెబ్బతిన్న పాము.

ఆలోచించి "ఇప్పుడే కాదూ మాట్టాడవద్దన్నావూ నువ్వూ?" అనడిగాడు మొండిగా, నిష్ఠురంగా చూస్తూ.

"సడే" అందామె; కాని వ్యవహారం మరో అంతస్థులోకి వెడుతోందని శంకించుకుంది.

అదే నిజమైతే గ్రంథం తుంచెయ్యాలి, లేకపోతే చిక్కులున్నాయి.

అలా తుంచెయ్యడంలో కూడా విలాసాలు చూపించే అవకాశం వుంది, తన స్త్రీజాతికి.

కాగా, మేజామీద వుండిన ఫలహారప్పళ్ళెం అందుకుని "యిలా తిరగండి" అందామె, చంటిపిల్లవాణ్ణన్నట్టు బెల్లించి చూస్తూ.

ఇదంతా వోరకంట చూశాడతను.

"చేతిలోకి వస్తోంది పిట్ట" అనుకున్నాడు.

అక్కడ ప్రారంభమైన విలాసాలకు మారాకు తొడగాలంటే తనది కోపం కాదన్నట్టు స్ఫురింపచెయ్యాలామెకి, కావ్యార్థ సూచనలాగ,

కనక ఉన్నవా డున్నట్టామెకేసి తిరిగాడు లాఘవంగా.

"దగ్గరికి రండి"

మీదిమీదికి జరిగాడతను "మరేం చేస్తావో చెయ్యి" అన్నట్టు చూస్తూ.

"నాకేసి చూడండి"

నవ్వు వచ్చిందతనికి; కాని అతిప్రయత్నంమీద బిగపట్టుకుని, గాంభీర్యం కూడా తెచ్చుకున్నాడు, ముందు.

అతితాపీగా మొగం తిప్పుకుని, అంతకంటేనూ మెల్లిగా ఆ మొగం పైకెత్తుకుని, మెల్లిగా కళ్ళు పెద్దవిచేసుకుని, రెప్పవెయ్యకుండా చూశాడు, చివరికి.

అతని ప్రయత్నమేమో ఆమె పాలించడమే.

ఊహ కూడా ఆమెను ప్రసన్నురాలిని చేసుకోడమే.

అయితే, నవ్వు బిగబట్టుకోడానికి చేసిన ప్రయత్నం అతి అయి, అతని చూపులకు కరుకుతనం చేకూర్చింది.

అదంతా కోపమే అనుకుందామె.

ఆమె గాంభీర్యం అంతా పూర్వపక్షం అయిపోయింది, దాంతో.

బెట్టుసరి కూడా నీరయిపోయింది.

దీనికి సాయం,— చెలికత్తెతో మాట్లాడుతూ వంకాయబజ్జి చేస్తున్న కూతుర్ని యేమార్చి వచ్చింది తాను.

ఇక్కడే కూచుంటే ఆమె కేకలేస్తుంది.

ఫలహారం కాకుండానే ఆ కేక వస్తుందేమో?

కనక, "తొరగా కానివ్వండి" అంటూ ఫలహారం చేయించింది, మధ్య మధ్య తాను కూడా కాస్త కాస్త పుచ్చుకుంటూ.

కాఫీ యిచ్చింది కొసిరికొసిరి; కాని అతనామె చెప్పింది చేస్తూ కూడా అలా బిగపట్టుకునే వున్నాడు మొగం.

ఇదంతా రసాభాస అయిపోయినట్టనిపించిందామెకి, దాంతో.

మొగాన బేలతనమున్నూ అలుముకుంది.

మరి వుండలేక బుజం పట్టుకుని కదుపుతూ "ఏం కోపం వచ్చిందా?" అంటూ జాలిగా చూసింది.

ఓః!

అఖండవిజయం పురుషుల కది.

ఏనుగెక్కినంత వుల్లాసం వచ్చిందతనికి, దీంతో.

శృంగారవిలాసాలున్నూ పుట్టుకువచ్చాయి, అవ్యవధానంగా,

ఎడమచేత్తో ఆమె నడుము చుట్టవేశాడు, వెంటనే బుగ్గకి బుగ్గ ఆనించి పావురం లాగ కువకువలాడుతూ.

2

మడతకండువా మెడలో సవరించుకుంటూ వీధిసావట్లోకి వచ్చాడు, రామబ్రహ్మం.

అతనికోసమే అక్కడ కనిపెట్టుకుని వుండన వెంకుసోదెమ్మ "ఏమాలోచించావు నాయనా?" అనడిగేసింది నిశ్చలంగా చూస్తూ, వెంటనే.

"ఆలోచించాను గాని యింకా యేమీ నిశ్చయించలేదమ్మా"

"ఏమీ అంటే?"

పోలీసుల అదమాయింపులా కనపడిందతనికిది.

ఇంటిల్లపాదికీ తాను లోకువ అయిపోయివుండినట్టనుమానం పుట్టి, అభిమానమున్నూ ముంచుకువచ్చేసింది.

పురుషకారం యెలా వుండినా యెత్తింది మగజన్మ మరి.

పైగా గ్రాడ్యుయేటు—సెమీ అయితే యేంగాక.

కనక, యిది బాగాలేదనుకున్నాడు.

ఇక యిలా జరగనివ్వకూడదనిన్నీ నిరుకుచేసుకున్నాడు.

"బదులు చెప్పకపోతే యేం?" అనుకున్నాడుకూడా; కాని "చదువు చెప్పించడమా మాన్పించడమా అని" అంటూ నోరు జారిపోయింది.

పోనీ అంటే, అవతలి మనిషి అతణ్ణి కన్నతల్లి.

ఆయింటో— అతనిమీద కూడా ఆమెకీ వున్నాయి కొన్ని అధికారాలు, సహజంగా.

పైగా, భర్త అకాలమరణం పొందిన దుఃఖం అంతా మరిచిపోయి, మూడుమాసాల గుడ్డుని పెంచి యింతవాణ్ణి చేసుకుందామె.

తన చెప్పుచేతల్లోనుంచి జారిపోకుండా మిక్కిలీ జాగ్రత్త పడుతూనున్నూ పెంచుకుందామె.

ఇప్పటికీ ఆజాగ్రత్త మరిచిపోలేదామె.

నలభై యేళ్ళవాడతను; కాని చంటిపిల్లవాణ్ణి ఆజ్ఞపెట్టినట్టు నడిపిస్తూ వుంటుందతణ్ణి, యెలాంటి సందర్భంలోనూ కూడా.

"కాగా చెప్పించడం యిదివరకే జరుగుతోంది, యిక నువ్వాలోచించవలసింది మాన్పించడం మాటే" అంటూ సాగతీసుకుంది, చేతులు తేలవేసుకుంటూ.

అక్కడ యేదో విధంగా తప్పించుకు వచ్చాటప్పటి కిక్కడ యిది.

ఇంటి కంతకీ తా నొక్కడే మొగవాడు.

యజమాని; కాని ఉన్న యిద్దరు స్త్రీలూ తనమీద అధికారం చెలాయిస్తూనే వుండడం చాల బాధపెట్టిందతణ్ణి.

కాని, కిమ్మనలేకపోయాడు.

యథాపూర్వకంగానే ఆందుకుందామె.

"చిన్నాడవూ చితకాడవూ కాదు నువ్వు, కాస్త పెద్ద తరహా నేర్చుకోవాలీపాటికి."

ఇలా అందే గాని, ఆ వాతావరణమే యెరగనివాడికి, ఇవాళ హఠాత్తుగా పెద్దతరహా వస్తుందా?

ఇది యోచించుకోలేదామె.

ఎంతసేపూ తనకి విధేయుడయి వుండేటట్టు చూసుకుంటూ వచ్చినందుకు, పెళ్ళానికిన్నీ విధేయుడయి వుండే ధోరణే అబ్బిందతనికి.

అయితే, యీామె వ్యవహర్త.

ఆమె ప్రణయవతి మాత్రమే.

కాదంటే, విలాసవతిన్నీ.

పరోక్షంగా నయినా తానింటికి యజమానురాలు కనక, తన భర్త తన కనుకూలుడై వుండాలనుకుంటుందామె.

ఇది యెప్పుడో గుర్తించేసింది వెంకుసోదెమ్మ.

అది మొదలు, సమయం వచ్చినప్పు డల్లా కోడలిని దూరంగా నెట్టుకుంటూనే వస్తోం దామె, మెళుకువగా.

బయట వుండి సాటివాళ్ళని చూసినప్పు డేమనుకున్నా—ఇంటో వుండినా లోపల్లోపల యేమనుకోగలిగినా అత నందుకనుగుణంగానే సంచరించుకుంటున్నాడు.

ఇక్కడే వుంది భేదం, చిన్నప్పుడే తండ్రి చనిపోయిన మొగవాడికి, తండ్రి చెప్పుచేతుల్లోనే పెరిగిన మొగవాడికీనీ.

నిజానికి, కొడుకు తెలివితేటలు కావా లనడంలో తల్లికీ తండ్రికీ వొకరక మైనదే శ్రద్ధ; కాని వీధికి వెడితే దుస్సహవాసాలలో పడిపోతా డేమో అని — కనీసం స్వతంత్రించడం అయినా నేర్చుకుంటా డేమో ఇంటోనే మూసిపెట్టుకుంటుంది తల్లి, కొడుకుని.

తండ్రి మాత్రం అలా కాదు, ఇటు దుస్సహవాసాలలో పడకుండానూ

చూసుకుంటాడు, అటు స్వతంత్రుడూ వ్యవహర్తా కూడా అయేటట్టూ చూసుకుంటాడు, కొడుకుని.

వీధికి వెళ్ళే మొగవాడికే వుండే దృక్పథం యిది.

రామబ్రహ్మం దీనికి దూరం అయిపోయాడు, చిన్నప్పుడే.

కాగా, తల్లి అన్నా భయమే, పెళ్ళాం అన్నా వొణుకే మొదణ్ణుంచీ అతనికి.

అయితే అటు మాతృవాత్సల్యమూ, యిటు భార్యా ప్రణయమూ గూడా పుష్కలంగా అనుభవిస్తున్నా డతను.

వీధికి మాత్రం వెళ్ళలేదు.

ఎలాంటి వ్యవహారం అయినా అర్థం అవుతుంది; కాని నడవదు.

నడిపించుకుందా మన్న చూపే లేదు.

మొదణ్ణుంచీ సంసారం తన గుప్పిట వుంచుకుని వుండిన వెంకు సోదెమ్మ కిదీ కావలసింది.

అయితే, చిన్నతనం కావడంవల్ల పెళ్ళాం మాట అంటే తియ్యగా వుండినా తాను కళ్ళెర్ర జేసినప్పుడూనా?

3

ఈదిలాసాతో మళ్ళీ అందుకుందామె.

"నువ్విలాగ నీళ్ళు నములుతూ కూచుంటే వల్లమాలిన అప్రతిష్ఠ చుట్ట బెట్టుకుంటుంది సుమా."

"చదువుకుంటే అప్రతిష్ఠ యేమిటమ్మా?"

"ఆ!"

"పోనీ, పాఠశాలకి వెడుతోం దేమో అంటే లేదాయె. నాలుగ్గోడల మధ్యా — ఇంటో కూచుని, చడీచప్పుడూ లేకుండా—"

"అదేమిట్రా నీమాటలూ నువ్వూనూ? ఇంటో కూచుని అయితే మాత్రం అదేమి చదువురా?"

"ఏం?"

"నువ్వు వచ్చి మావాళ్ళకి తెలియకుండా నన్ను తీసుకుపో" అంటూ కృష్ణమూర్తికి వుత్తరం రాస్తుందిట రుక్మిణీదేవి. ఆవళంగా వచ్చి అతగాడు అమాంతంగా ఆమె నెత్తుకుపోయి—ఇలాంటిదేనా యీడువచ్చిన పిల్ల నేర్చుకోవలసిన చదువు?"

"ఏమిటీ?" అనిపించిం దతనికి.

అరికాలిమంట నెత్తి కెక్కింది; కాని అది రుక్మిణీదేవికల్యాణం కథ అన్నమాట జ్ఞాపకం వచ్చిం దంతలో.

"భావకవుల రచనలు చదివితే యేమో గాని మహాభక్తుడు కదా పోతరాజు రచన చదివినా చెడిపోతారా ఆడపిల్లలు?" అనుకున్నాడు, దీనిమీద.

అది తీరకపోగా "మరి, యిప్పటి యే[బాసిపిల్లలు రాసేటట్టే రాసిం దేం వుత్తరం రుక్మిణీదేవి?" అంటూ మరో సందేహం కలిగింది.

"అందుచేతనే కామోసు అమ్మకి గుంజాటన?" అనిపించింది.

అయితే, అటు చూస్తే, కూతురి దృష్టి చెడుతుం దన్న అపాయశంక కనపడింది; కాని యిటు చూస్తే, స్వతంత్రించి వ్యవహరించవలసిన చిక్కు కనపడుతోంది, తనకి.

కాక,—స్థితి వున్నందుకు, చక్కగా పొద్దున్న బిలియర్డ్సున్నూ, సాయంత్రం టెన్నిస్సూ ఆడుకోకుండా ఈపాడు గొడవ లేమి" టనిపించింది.

"రాగాలు తీస్తూ, కళ్ళు తిప్పుకుంటూ పాతికేళ్ళవాడు పాఠం చెప్పడమా?" అంటూ ప్రారంభించింది, మళ్ళీ ముసలమ్మ.

"ముసలిపండితుడు చెబితే పనికివస్తుంది కదా?" అనడుగుదామనుకున్నాడు; కాని వశం కాలేదు.

ముసలావిడే అందుకుంది.

"ఎక్కే గుమ్మమూ దిగే గుమ్మముగా [పయివేట్లు చెప్పి పొట్టపోసుకునే వాడికి అపట్టంచుల పంచెలూ ఆజరీకండువాలూ యెక్కణ్ణుంచివస్తాయో, అవెక్కడి సెంట్లో, ఆతాంబూలానికి విదీవిరామమూ వుందో లేదో—"

"తక్కిన యిళ్ళవాళ్ళందుకు చెప్పించుకుంటున్నారూ ఆయనచేత?"

"అయితే?"

"మన కెందు కీ సందేహం?"

"వాళ్ళ కర్మం, మన కేం?"

ఝుమాయించి యిలా అడిగేసిందే గాని, తన మాటలో తనకే పూతం కనపడలే దామెకి

ఆలోచించింది.

"సుందరి యేమి చేస్తోం దండీ అమ్మమ్మగారూ?" అంటూ వస్తాడాపిల్లాడు. అమ్మాయి కొడుకు కూతురా? తా నేమో నాకు కూతురి కొడుకా? వావి యెలా కల్పించాడో చూశావా?" అనడిగింది, వెంటనే "ఏం చెబుతా" వన్నట్టు చూస్తూ.

"ఆ, ఆ" అనుకున్నా డతను.

దడా దడా కొట్టుకున్నా యతని గుండెలు.

"అహితాగ్నుల కుటుంబంరా మనదీ. నీపూర్వు లెవరూ వొకరిచేత వేలుపెట్టి చూపించుకో లేదురా" అని కూడా అంది, ఆవేడి తగ్గకుండా.

అయితే, వారి నెవరినీ యెరగడతను: కాని ఆపూర్వులు—ముఖ్యంగా—అతని పితృపితామహప్రపితామహులు ముగ్గురూ వచ్చి తన యెదుట నుంచున్న ట్టనిపించిం దతనికి.

తనలాగ అప్రాచ్యవేషంతో కాక, నీరుకావి ధోవతులు కట్టుకునీ, కాశ్మీరుశాలువులు కప్పుకునీ, కుండలాలున్నూ ధరించీ బ్రహ్మవర్చస్సం పన్నులై వున్నారు వారు.

తళతళ మెరుస్తూ వారిచేతుల్లో చిన్నచిన్న రాగిజారీలున్నాయి.

"మేము స్వతంత్రులంగా బతికాం. మా సంసారాలు మేము స్వయంగా నిర్వహించుకున్నాం. మాభార్యలను మేము ధర్మపత్నులనుగా చూసుకున్నాం, ఆటవస్తువులుగా కాదు. మా తల్లుల మాటమీదా, మా తోడబుట్టువుల మాట మీదా మా ఆడపిల్లల గొంతుకలు కొయ్యలేదు మేము" అన్నట్టూనూ అయింది వారు.

చేత్తో దేవేసిన ట్టయిపోయిం దతని మనస్సు, దీంతో.

"అమ్మ చెప్పినట్టు నడుచుకోడమేనా, కూతురి బతుకు చూడ్డం యేమయినా వుందా?" అన్న ప్రశ్న యెక్కణ్ణుంచో వచ్చి చెవులు గింగురు మనిపించింది.

"అమ్మా యేమంటుందీ?" అనడిగాడు దురుసుగా దీంతో.

"మచ్చికపడింది, మాంతా నంటుందా అదీ?"

"అడిగే దొకటీ చెప్పే దొకటీన్నీ" అంటూ విసుకున్నాడతను, మొగం పక్కకి తిప్పుకుని.

"కాకపోయినా, దాని యిష్ట మేమిట్రా?" అంటూ నిలవతీసింది ముసలమ్మ.

ఒక్క నిమిషం అత నిలా చూడలేదు.

తల్లిమాట మాత్రం చెవిని పడింది, అనిమిషాన.

"చదు వబ్బుతోంది గాని లోకజ్ఞాన మేదీ చిట్టితల్లికి? కనక, అమ్మ అన్నమాట నిజమే" అనుకున్నా డతను.

"న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అన్న కారిక గూడా గభీమని జ్ఞాపకం వచ్చింది; కాని "మీఅమ్మ మాత్రం ఆసూత్రంకిందికి రాదుటోయ్?" అంటూ యెవరో టొకాయించినట్టయింది.

నిర్విణ్ణు డయిపోయాడు.

"ఆపిల్లాడు వస్తే యిక మాఅమ్మాయి చదువుకోదు వెళ్ళిపొమ్మని చెప్పేస్తా" నంటూ ముసలమ్మే అందుకుంది, అతని తటపటాయింపు చూసి.

అప్పటికీ అతని నిర్విణ్ణత వదలలేదు; కాని అవతలివైపున "జాగ్రత్త" అని తర్జనితో నిషేధిస్తూ భద్రమ్మ ఉగ్రమూర్తి కనపడింది.

స్తబ్ధుడే అయిపోయాడు, దాంతో అతను.

"ఏమంటావ్?" అనడిగింది ముసలమ్మ, చూసిచూసి.

"..................."

"మాట్టాడ వేమిరా?"

"....... ...."

"అక్కా బావా అక్కడ వీధికి రాలేక కుళ్ళిపోతున్నారురా."

"ఎందుకూ?"

"అయ్యో, అయ్యో—"

"కుళ్ళి కుసిల్లిపోవలసినంత వుప్పెన యేం వచ్చిం దమ్మా వాళ్ళకి?"

"చెట్టంత కొడుకు బుగ్గయిపోయి—ఈడు వచ్చి రంభలావున్న కోడలు వీధెక్కి చదువులు వెలిగిస్తోం దంటే- ఇదేమీ విపరీతం రా, నీకింత మంచీ చెడ్డా తెలియకుండా వుందీ?"

"మన అమ్మాయి మంచిచెడ్డలు మనం చూసుకోమూ?"

"చూసుకోమనే కాదూ నేను చెబుతున్నది మాత్రం?"

"స్నేహితులతో దచ్చీలు కొట్టడంలో వున్న శ్రద్ధ సంసారం విషయమై లేదా యేమిటి మనికి?" అని తనికి తానే ఆకాంక్షించుకున్నా డతను.

"ఛా, యిక యీపోసుకోలు తిరగాటం మానేస్తే బాగుంటుందేమో? అను కున్నాడు కూడా; కాని మొగాలు వేలవేసుకుని యెందరో స్నేహితులు తన కోసం సమాజంభవనంలో పడిగాపులు పడివుండినట్టు కనపడిం దతనికి.

"నువ్వొక్కడవూ లేకపోతే మే మెంతమంది వుంటే మాత్రం యేమి ప్రయోజనమూ?" అని వారు దేవుళ్ళాడుతున్నట్టున్నూ కనపడింది.

తానే వారిలో గొప్పవా డన్న గర్వం పుట్టుకువచ్చిం దతనికి దీంతో.

"పాపం—దరిద్రులు" అనుకున్నా డింగ్లీషులో.

పైతృకంతో వేషాలకు పోయేవా రందరిదీ యిదే మచ్చు లోకంలో.

తమ జాతి — తమ దేశం — తమ జిల్లా — తమ వూరు — తమ సంఘం — కనీసం తమ జట్టు తమ దయాధర్మభిక్షాలమీదే నడుస్తున్నట్టు వారి భావన.

అందులోనూ, అందరికంటే యెక్కువ వున్నవాడేమో రామబ్రహ్మం మరీనూ.

కాగా "వెళ్ళాలి" అంటూ తొందర పుట్టేసిం దతనికి.

మనసులో సంకల్పంతో పాటు కాళ్ళల్లో చలనమున్నూ కలిగింది.

ఒక్క అడుగున్నూ పడింది వీధికేసి; కాని మొగం పై కెత్తుకునేటప్పటికి తల్లి రూక్షేక్షణాలు కళ్ళల్లో గుచ్చుకున్నాయి.

"చూడు" అంటూ గద్దిస్తున్నట్టందుకుని "అల్లుడు చచ్చి పోయినందు కేమయినా విచారిస్తుందా నీపెళ్ళాం?" అనడిగింది.

మాట అందలే దతనికి.

"పోనీ అంటే, సుందరమ్మయినా దుఃఖం యెరుగునా?"

అడిగి వూరుకోలేదు ముసలమ్మ, తెగ సాగతీసుకుంది.

అదెందుకో అర్థం కాలేదు రామబ్రహ్మానికి.

పెళ్ళి కాకపూర్వం ధుమధుమలాడుకుంటూనే వుండేవారు సుందరీ కిష్టప్పాను, ఎప్పు డొకచోట చేరినా.

అనిష్టానికి సాయం సిగ్గొకటి——పెళ్ళయాక చూడ్డమే మానుకుం దతణ్ణి ఆమె.

ఈస్థితిలో రజస్వల అయిం దామె.

స్త్రీ కంటికి కొత్త వెలుగు కనపడే దశ అది.

పరోక్షంలో వున్న భర్త రూపం స్ఫురిస్తూ వుండడమూ, మాటిమాటికీ చూపు అటు మళ్ళుతూ వుండడమూ, భావనలో యేదో మాధుర్యం పొడగట్టడమూ జరిగే సమయం అది; కాని సుందరమ్మ రజస్వల అయిందన్న శుభలేఖ పట్టుకువెళ్ళిన పురోహితుడు, కిష్టప్ప సుస్తీగా వున్నా డన్న కబురు పట్టుకు చక్కావచ్చాడు, కాకినాడనుంచి.

మరో రెండు రోజులకు "అబ్బాయిని ఆస్పత్రిలో చేర్చారుషరా" అని చెబుతూ ఎగిరి కాకినాడ వెళ్ళిపోయింది ముసలమ్మ.

అదేమిటో యెందు కలా జరిగిందో చెప్పినవా రెవరూ లేక పోయారు, యింకో రెండు దినాలకు కిష్టప్ప మరణవార్త తప్ప.

"అయినప్పుడు సుందరమ్మ అయినా దుఃఖం యెరుగునా?" అనడిగితే యేమిటి చెప్పడం?

ఇదేమీ ఆలోచించలేదు ముసలమ్మ.

"అసలు, నీపెళ్ళామే మార్చేస్తోంది దాన్ని, నేనెరగనూ?" అంటూ మళ్ళీ అందుకుం దామె.

"ఎలా మారుస్తోందీ?"

"నేను చెప్పాలా?"

"..................."

"ఈమాత్రమూ గుర్తించలేవూ నువ్వూ?"

". . . . ."

"ఇల్లు గుల్లచేసుకుని చెప్పించాను నీ చదు వంతా యేమయిపోయిందీ?"

ఏమిటో అనుమానం.

ఎందుకో కంగారు.

నోరు విప్పి తన తల్లి చెప్పలేని పాడుపను లేమయినా....

చర్రున కోపం వచ్చిం దతనికి.

వూగిపోయాడు, దాంతో.

కాని తానందుకు పూనుకుంటే సుందరమ్మ కాదు, భద్రమ్మ యెదురు కుంటుంది, తనని.

చల్లబడిపోయా దతను.

ముసలమ్మే అందుకుంది, అవ్యవధానంగా.

"నీమామగారు వీరేశలింగానికి స్నేహితు దని లోకం అందరూ యెరుగుదురు."

"అయితే?"

"అయ్యో, అయ్యో—"

"కాకపోయినా, యిప్పు డాయన లేరుగా?"

"మరి నీమామగారు?"

". . . . . . . తప్పుతప్పు, ఎవ రయినా వింటే బాగుండదు, వూరుకో యీపాటికి"

"ఎందు కూరుకోవాలీ?"

". . . . ."

"ఎవ్వడ్రా నాయెదుట నుంచుని నీకిది తగ దనగలిగేవాడు?"

"నువ్విలాంటి మాట లంటావు కనక నే నీకూ నీకోడలికీ పడకపోదం"

"పకడపోతే పడకపోతుంది పోనీ."

" . . . ."

"దానివల్ల నాకేం దిగబడిపోతుందీ?"

" . . . ."

"నన్నేం చెయ్యగలదురా అదీ?"

"నువ్వు మాత్రం దాన్నేమి చెయ్యగలవూ?" అనుకున్నాడతను, మొగం అటు తిప్పుకుని.

"పోరి, అమ్మాయిని నేను కిష్టప్ప కిప్పించా నని—"

"అవును"

అక్కకీ బావకీ అప్రతిష్ఠ రావాలని—"

అదేమిటి మళ్ళీ?"

"పిల్ల మనస్సు—"

"ఏమిటి పిల్లమనస్సు?"

కొంచెం నిష్ఠురంగా అడిగా డీమాట.

"ఏమిటమ్మా నీగోల?" అని కూడా అడిగాడు, పురపుర చూస్తూ.

"గోలకిందే కట్టేశావా నాది?"

"కట్టను, ఏమిటో చెప్పు, మరి."

"నిన్నగాక మొన్న, వొక కోమట్ల పిల్ల, మళ్ళీ పెళ్ళిచేసుకుని మన వీధిలో వూరేగింది, 'నన్నే చూసుకో' మంటూ."

"ఊరేగిం పెందుకోసం మరి?"

"సడే"

" . . . ."

"పోనీ దాని జోలి నా కెందుగ్గానీ—సంబరపడ్తూ చూశారు అమ్మాయీ నీపెళ్ళామూను, అరుగెక్కి."

"ఇంకెవరూ చూడలేదూ?"

"చూడకేం?"

"వాళ్ళు తలుపులు బిడాయించుకునే చూశారా, యింటో వుండి?"

"అదా యేమిటి మాట?"

"కాకపోతే మరేమిటి?"

"చూసి తక్కినవా ళ్ళందరూ ఛీ ఛీ అన్నారు."

"అందరూనా?"

"అందరూనా అంటే అందరికీ కావాలా యేమిటి?"

"నీకు మాత్రం యెందుకూ?"

"..........."

"..........."

"మన యింటి పద్ధతి బాగా లేదు కనక."

"బాగా లేని దేమిటి?"

"అలా వికటంగా అడిగితే—"

"నీవేదాంతం యేమిటో నాబుఱ్ఱ కెక్కడం లేదు. ఏమిటో పెంచుకు పోతావు గాని, అసలు సంగతి—"

"నువ్వు గ్రహించుకోవాలిగాని, యింతకంటే యేమి చెప్పనురా నేనూ?"

"చెప్పకపోతే చల్లగా వూరుకో. నువ్వూ నీకోడలూ ఏదో కుళ్ళు పెంచు కుంటూ మధ్య నన్నేడిపిస్తున్నారు. మీ యిద్దరి మధ్యా గానుగులో చెరుకు లాగ నలిగిపోతున్నాను నేను. మీ తగువులు తీర్చడం నావల్లకాదు."

టెన్నిస్‌బాటు చేతిలో వుందేమో, యెదటివాడు కట్ చేస్తే కోర్టులో లాగ, వొక్కటే అంగ వేశాడు, వీధిలో కతను.

"వెళ్ళిపోతావుట్రా?" అంటూ గడపదాకా వెళ్ళింది, ముసలమ్మ; కాని అప్పటికప్పుడే మళుపు తిరిగేశాడు కూడా.

"....హోరి చచ్చుపెద్దమ్మా, వెళ్ళిపోతావుటా.... నీదగ్గిర యింత చేవ వుంది కనుకనే వొంటికాళి భరతం ఆడుతోం దావగలాడి.... అమ్మమ్మ నిట నే నీ నిర్భాగ్యుడికి. నామనుమడు చచ్చి నే నేడుస్తూ వుంటే — రానీ చెబుతాను."

ఇలా రుంజుకుంటూ అరుగుమీదే కణాయించుక్కూచుందామె.

4

"చూ—శావుటే అమ్మా" అంటూ గునుస్తూ వచ్చింది సుందరమ్మ.

పిండివంట యేదో తయారుచేస్తోంది భద్రమ్మ, వంటింటి వసారాలో. తదేకదృష్టితో చేస్తోంది.

కాగా, యిటు చూడకుండా "యేమిటమ్మా?" అనడిగింది, అంత తొందరలో గూడా గారాంగానే.

"శాస్త్రిలుగారు రాలేదుట."

"ట?"

"అవును."

"ఎంచేత్తో?"

"వచ్చారుట; కాని వెళ్ళిపోయారుట."

"ఏమో?"

"ఏమో"

"నాయనమ్మ వేనా యీమాటలు?"

"అవును."

"అన్నీ వేషాలు. ఆడదా మనుకొంటోంది అట" అంటూ తల తాటించు కుంది భద్రమ్మ, చేతిలో వున్న పని ఆపి, గ్రీవాభంగాభిరామంగా చూస్తూ.

"ఉండకుండా వెళ్ళిపోయినప్పుడు వచ్చినా రానట్టే కాదా—"

"అనడిగిందా?"

"అడిగిం దమ్మా."

"తర్కం అంతా కురిపించేసిందే!"

"జీతం జీతం అంటూ గొణుక్కుంటూ వెళ్ళిపోయారుట."

"ఆమాట యెందుకు వచ్చిందో?"

"అడిగాను, 'ఇంతకంటే పెద్దజీతం వచ్చే పాఠం దొరికిందేమో మరి' అంది."

"అలాగేం? అంతా కల్పన. ఏవో పుల్లవిరుపు మాటలని—"

"పుల్లవిరుపు మాటలతో కుదర్చిందో లేదో?"

"ఎన్నిమాట్లు పిలిచారో పాపం."

"పిలుపందకుండా తలుపు వేసేసిం దేమో?"

"అంత జాణ కాదనా?"

"నిన్నూ పిలువరుట, తననీ పిలువరుట, యెప్పుడు వచ్చినా నన్నే పిలుస్తారుట—విన్నావా?"

"అలాగా?"

"మేడమీద వసారాలో నుంచుని కనిపెడుతూనే వున్నాను నేను. అయితే, అది కాదని యిదీ, యిది కాదని అదీ ప్లేటు మార్చడంలో ఫోనుదగ్గిర నాలుగైదు నిమిషా లుండిపోవలసి వచ్చిం దొకమాటు. ఆసందుబాట్లో జరిగివుంటుందది."

"అంతే అంతే."

"సమయానికి నాన్నారు కూడా లేకపోయా రింటో"

"రానియ్యి, అదేమిటో కనుక్కుంటాను."

ఒక్క క్షణం వూరుకున్నా రిద్దరూ.

భద్రమ్మ పని అందుకుంది.

ఇంకో క్షణం వెనక్కీ ముందుకీ తక్కళ్ళాడి 'ఇప్పుడు వాళ్ళ రామలక్ష్మికి పాఠం చెబుతూ వుంటాడు" అంది సుందరమ్మ, సిగ్గు తెమల్చుకుంటూ.

"సోమశేఖరం మామయ్యగారి యింటికి వెళ్ళి వాళ్ళ లచ్చిగా ణ్నొక మాటు తీసుకురా నువ్వు."

"ఎందుకే అమ్మా?"

"నీకు పాఠం చెప్పడానికి భోజనం చేసి రాత్రి రమ్మని కబురు చేస్తాను, శాస్త్రిలుగారికి"

దీనిమీద ఏదో అనబోయింది సుందరమ్మ; కాని సాహసించ లేక పోయింది.

పోనీ అంటే, అనకుండానూ వుండలేకపోయింది.

ఒక్క క్షణం వూగిపోయిం దీ ద్వైవిధ్యంతో ఆమె.

ఉండుండి సాహసం చేసింది చివరికి; కాని "పోనీ—" అని మాత్రమే అనగలిగింది

"ఏమంటావు తల్లీ?"

"........."

"చెప్పవే అమ్మా?"

"నీకు తెలవదా యేమిటి?"

"ఈపని తొందరలో నా కేమీ తోచడంలే దమ్మా."

"మైసూరుపాకు చేస్తున్నావు కాదా యేమిటి?"

"చేస్తే?"

"........."

"శాస్త్రిలుగారికి—"

"ఏమో నాకు తెలవదు" అంటూ బుంగమూతి పెట్టుకుంది సుందరమ్మ, మొకం అటు తిప్పుకుని.

ముక్కలు మరో పళ్ళెంలో పేరుస్తూ ఆలోచించింది భద్రమ్మ.

పని మానేసి దృష్టి యేకాగ్రం చేసుకునిన్నీ ఆలోచించింది.

"ఇంకేమిటీ మరీ?" అంటూ యిటు చూస్తూ అడిగింది, అటు పేరుస్తూనే.

సుందరమ్మ కూడా సరిగా అప్పుడే అటు చూసింది, తల్లి వాలకం గుర్తిద్దా మని.

ఇద్దరి కళ్ళూ అభిముఖా లయినాయి.

ఇద్దరి చూపులూ కలిశాయి.

ఇద్దరికీ వూహ కూడా అందింది.

"భోజనాని క్కూడా రమ్మంటాను, సరా?" అంది భద్రమ్మ.

సిగ్గు మరీ ముంచెత్తగా తలుపుచాటున నక్కింది సుందరమ్మ.

"అంత సిగ్గెందుకు తల్లీ యీమాత్రానికి? మరి లచ్చిగాణ్ణి తీసుకురా తొరగా" అంటూ మళ్ళీ పని అందుకుంది భద్రమ్మ.

ఓరచూపులు చూసుకుంటూ గుమ్మందాకా అడుగులో అడుగు వేసి, తరువాత వూచ అయిపోయింది సుందరమ్మ.

"వెర్రితల్లీ" అనుకుంది భద్రమ్మ, అది గుర్తించి.

ఆమాత హృదయం పుప్పొంగిపోయింది ఆముగ్ధవిలాసానికి.

6

మేడమీద పనుండి భద్రమ్మ మెట్లదగ్గిరికి వచ్చేటప్పటికి "ఉత్తరం రాశాడుమాబావ" అంటూ నాలుగు కాగితాలు చేతబుచ్చుకుని హాల్లోనుంచి వచ్చి కలుసుకున్నాడు రామబ్రహ్మం.

"ఏదీ?"

"ఇంగ్లీషులో రాశాడు."

"సీమనుంచి యిప్పుడే వోడ దిగారు కామోసు దొరగారు."

"......................"

"ఏమి రాశా రింతకీ?"

జాబు చేత్తో పుచ్చుకుని ఆమె సంబరపడుతూ చదువుకుంటుందనుకుని రాలేదతను.

తాను చదివితే సావధానంగా వింటుందనుకునీ రాలేదు.

తరువాత యేమి చేసినా, ముఖ్యాంశం అయినా వినకపోదుగదా అని అతని ఆశ.

రెండు రోజుల కోమాటు యిలాగ వుత్తరం మీద వుత్తరం వస్తే కొంచెమయినా ఆమె వస్తాయించకపోదనిన్నీ అతని నమ్మకం.

"కనక, దారికి తీసుకురాలేకపో"మని అతని దిటవు; కాని ఆమె మొగం చిట్లించుకోడం చూసి, వినకుండానే పైకి వెళ్ళిపోతూందేమో అన్న ఆత్రంతో "చాలాదూరం రాశాడు, పాపం" అన్నాడు, జాలిగా.

"వారి పాపపుణ్యాల జోలి మన కెందుకూ?" అందామె, ముక్కు మూతీ త్రిప్పుకుంటో, అవ్యవధానంగా.

"కాకపోయినా, అంత దూరం కూడాకూడా రావడానికి నాకిప్పుడు తీరికా లేదు, వోపికా లేదు" అనిన్నీ అంది, వెటకారంగా.

అంటూనే అడుగు ముందుకి వేసేసింది.

"నుంచోవూ?"

".... ...."

"మాట."

"ఏమిటా మాటా?"

ఆలస్యం చేస్తే యీ అవకాశం కాస్తా జారిపోతుందనుకున్నాడతను.

విషయం సూచిస్తే వాదాని కయినా ఆమె సిద్ధపడుతుందనీ, ఆ సందర్భంలో కొంత కాకపోతే కొంత అయినా మనస్సు మార్చవచ్చు ననిన్నీ అనుకున్నాడు.

"అమ్మాయి చదువు మాన్పించమని రాశాడు" అన్నాడు గభీమని.

ఇది వింది, గభీమని వెనక్కి తిరిగి, యెక్కిన అవొక్క మెట్టూ కూడా దిగి, వురిమి చూస్తూ అతని యెదట నుంచుందామె, ముందు.

చెయ్యి జాడించింది. తల తాటించుకుంది. "మానిపించంగాక మానిపించం అని రాసెయ్యండి వెంటనే" అంది తరవాత, వొత్తివొత్తి.

గతుక్కుమనిపోయాడతను.

"అగ్గిపుల్ల గీసి ముందావుత్తరం అంటించెయ్యండి, వెళ్ళండి" అంటూ నున్ను వురిమింది, వీధికేసి దారి చూపిస్తూ.

వెళ్ళవలసినవాడే అతను; కాని స్తబ్ధు దయిపోయి వుండడం వల్ల కదల్లేకపోయాడు.

"కొడుకు చచ్చాక గూడా తమ పెత్తనం యేమిటీ బోడి పెత్తనం?" అంటూ రుంజుకుం దామె, కరుగ్గా చూస్తూ.

"సబబే" అనిపించిం దతనికి; కాని ఆదురుసుతనానికి మాత్రం కించపడ్డాడు.

ఆమెకి వుక్రోషం తీరలేదు.

"లేనిపోనివి కల్పించి యేమిటేమిటో మీఅమ్మ వుత్తరం రాసి వుంటుంది. ఇందులో అవిడ ప్రమేయం కావలసినంత వుంది, నాకు తెలుసు పూర్తిగా."

"ఊళ్ళోవాళ్ళున్నూ నన్నాక్షేపిస్తున్నారు"

"ఎందుకో?"

"????? ???? ????"

"ఎవరెవరో?"

".... ...."

"ఏమనో?"

"చదువు మాన్పించడం యిష్టం లేకపోతే చెప్పడానికి ముసలి పండితు లెవరూ దొరకలేదా——"

"చదువు మాన్పించ మని కాదుగదా?"

"వాళ్ళ వుద్దేశం మాన్పించ మనే. ముసలిపండితుల ప్రస్తావన మనం చేస్తున్నదానికి సవరణ."

"పనిలేని మంగలి యేమో చేశాడుట."

".... ...."

"వెంకటదీక్షితులుగారి సోమిదేవి కాళ్ళకి జోడు తొడుక్కునీ, నెత్తిమీద గొడుగు వేసుకునీ నన్నే చూసుకో మంటూ మొగరాజులను రాసుకుంటూ కాలేజీకి వెడుతూ వస్తూ వుంటే నోరెత్తలేనివాళ్ళు——"

"అతనికీ చెప్పిచూశారు"

"చూసి?"

".... ....వినకపోతే వాళ్ళేం చేస్తారూ?"

"మనమూ అంతే అయితే?"

"అప్పుడూ అంతే చేస్తారు; కాని——"

"కాని యేమిటి మళ్ళీ?"

"మన విషయమై వారు చాలా బెంగపెట్టుకున్నారు."

"ఎంచేతో?"

"మన వంశం అలాంటిది, మరి?"

"అలాగ టండీ?"

".... ...."

"మరి, ఆబెంగపెట్టుకున్న వారి వంశాలు?"

".... ...."

"పోనీ వంశం వంశం మహా గొప్ప చెప్పుకుంటున్నారు కదా మీరు, మీవంశంలో మొగవాళ్ళెవరయినా చదువు పూర్తికాకుండానూ, ప్రయోజకత్వం లేకుండానూ వున్నారా యిప్పటిదాకా?"

కొరడా దెబ్బలా తగిలిం దతని కీమాట.

కళ్ళు చీకట్లు కమ్మినట్టున్నూ అయింది.

"మీఅక్కలాగ గిల్లి రక్కి-బరికి-యేడ్చి-దొర్లి-తమ పట్టు నెగ్గించుకున్న ఆడబడుచు లెవరయినా వున్నారా మీవంశంలో యిదివరకీ?" అనిన్నీ అడిగిం దామె.

చెయ్యి పెట్టి కడుపు దేవేసిన ట్టయిం దతనికి.

దీనికి స్థాయం "మీఅక్కతో వేగలేకుండా వున్నానోయ్" అంటూ తరుచు తన బావగారు గోలపెడుతూ వుండడం జ్ఞాపకం వచ్చిం దతనికి.

తన కొడుక్కి సుందరమ్మ నివ్వ నని భద్రమ్మ పేచీపెట్టినప్పుడు భోజనం చేస్తూ చేస్తూ లేచి నుంచుని "నీకూతుర్ని నాకొడుకు కిస్తావా సరి, లేక పోతే యిదిగో నేనీ అంటచేత్తో రయిలెక్కి కాకినాడ వెళ్ళిపోతాను. నాతమ్ముడికి బిడ్డలు లేరనుకుంటాను. నాకు పుట్టిల్లు లే దనుకుంటాను. నాశన మయిపోయిం దనుకుంటాను. బుగ్గయిపోయిం దనుకుంటాను. నిండేట్లో కొట్టుకుపోయిం దనుకుంటాను" అంటూ తన అక్క చిందులు తొక్కడం కూడా జ్ఞాపకం వచ్చిం దతనికి.

నోరెత్తలేకపోయాడు.

అతని స్థితి కనిపెట్టి "మాట్టాడరేం?" అన్న ట్టొకమాటు తల యెగర వేసుకుని మళ్ళీ అందుకుం దాదామె.

"మీఅమ్మ, అమ్మాయిని కాకినాడ వెళ్ళిపోదాం రమ్మందిట విన్నారా?"

"ఎందుకూ?"

"వెధవకోడ ళ్ళున్నవాళ్ళు పనిమనుషులనూ వంటలక్కలనూ పెట్టు కోరుట కాదూ?"

నిజానికి వితంతుపుత్రిక లున్నవాళ్ళున్నూ చాలామంది అలా చేస్తూ వుండడం అతనికి తెలుసు.

తన యింటో తన తల్లి పెత్తనమే సాగితే తన కూతురికిన్నీ అలాంటి గతే పట్టివుండు నని న్నీ అతనికి తెలుసు.

కనక, కొంత అతిగా వుండినా—కొంత అయినా భద్రమ్మ తన తల్లి నెదిరించడం బాగానే వుం దనుకున్నా డతను.

కాని, అక్క మాట యేమయినా "బావగారిని కూడా తృణీకరించడ మేనా?" అంటూ అభిమానం తెచ్చుకున్నాడు.

తన కొడుకు పోయినప్పణ్ణుంచీ తప్పించుకు తిరుగుతున్నాడు; గాని రామబ్రహ్మానికి చిన్నతనం కావడంవల్ల మొన్నటిదాకా ఆయన ప్రాజాపత్యమే యిక్కడ.

తన తల్లికి లాగే తన బావగారికిన్నీ పరమవిధేయు డయి పెరిగా డతను.

సమయంవస్తే తల్లిమాట అయినా తీసేస్తాడుగాని బావగారి మాట అంటే చాలా గౌరవం అతనికి.

ఇది భద్రమ్మకి తెలుసు.

సూటిగా, తన ఆడబడుచు పెనిమిటినే తాను తూర్పారబడితే కొంత కాకపోతే కొంత అయినా తన భర్త క్రుద్ధుడవుతాడు.

కనక, మరోదారి తొక్కాలి.

తన అత్తగారియెత్తుమీదనే నెగ్గుకువస్తూ వుండడం యీ మధ్యనే గ్రహించిం దామె.

కాగా "రామేశ్వరం ప్రయాణం కూడా తలపెట్టిం దన్న మాటేనా మీఅమ్మ?" అంటూ మళ్ళీ అందుకుం దామె, చురుగ్గా చూస్తూ.

పొడిచిన ట్టయిం దతని కీమాటతో.

"కాకినాడలో యెలాంటి ఆలోచనలు జరుగుతున్నాయో బోధపడు తోందా, కాస్తయినా?"

"........ .. ...."

"ఆయెందుకట్టెని చూసుకుంటూ అయినా మనల్ని బతకనిచ్చేటట్టు లేదన్నమాటే కాదూ?"

"అలా అందా మాఅమ్మ?" అనడిగా డతను పక్కకి చూస్తూ.

"ఇలా చూడండి."

"........."

"వినపడిందా?"

"........."

"అమ్మాయి అబద్ధం చెప్పిం దనే మీనమ్మకం?"

"నువ్వూ మాఅమ్మా వేసే యెత్తులు చూస్తే రణకంపరం యెత్తి పోతోంది నాకు."

"ఏమిటీ?"

".... ...."

"ఏమన్నారూ"?

".... ...."

"నేనూ వేస్తున్నానా యెత్తులు?"

"దీని పేరేమిటీ మరీ?"

"ఇది యెత్తుకి పైయెత్తు వెయ్యడం కాదు, మీమాతృ దేవత వుద్దేశాలూ ప్రయత్నాలూ యేలినవారికి విన్నవించుకోడం."

"............................"

"ఏం, అమ్మాయిని విడిచిపెట్టేశారేం?"

"............................"

"అర్ధాయష్యపు కొంకనక్క మొగుణ్ణి కట్టిపెట్టిన మీకు సందేహం యేమిటి—దానిమీద కూడా వొక తుట్ట పడే సెయ్యండి."

"పోనీ, అమ్మాయి దాని కేం బదులు చెప్పింది?"

"దాన్నే అడగండి, మధ్యనే నెందుకూ చెప్పడం?"

6

కఠిననరకంలో వున్నట్టున్న అతని కిది మంచి అవకాశం అయింది.

వెంటనే బయలుదేరాడు, బుర్ర వంచుకుని.

కూతురి దగ్గిరికి వెడతా దనుకుని పక్కకి వొత్తిగిల్లిం దామె; కాని మేడమెట్లమీద అడుగు పెట్టా డతను.

"అలా యెక్కడి కండి?"

"............................"

"మిమ్మల్నే."

"............................"

"నుంచోండి."

నిజంగా వురిమిం దామె.

నిలిచిపోయా డతను.

"వెనక్కి మళ్ళండి."

"...................."

'దిగండి, మెట్లు

"ఏం?"

"కాఫీవేళ అయింది."

"వోస్, ఇంతే గదా?"

తెల్లబోయిం దామె.

అప్పటి కప్పుడే మరో మెట్టెక్కా డతను.

"అయితే, నేనూ వస్తా పదండి."

"అదేమిటి?"

"నాకాళ్ళ దగ్గరికి మాత్రం రాదా యేమిటి, నేను మేడ యెక్కి కూచుంటే కాఫీ?"

"మరి, తయారు చెయ్యండం—"

"మీ అమ్మ చేత చేయించుకోండి."

"ఆః"

"లేకపోతే మీ అమ్మాయిచేత చేయించుకోండి, నాకేం?"

"నువ్వేం చేస్తావ్?"

"ఇదిగో యిదీ."

"అఘోరించినట్టుంది."

"తప్పుతప్పు, నిక్షేపం లా వుంది."

"………………"

"వోః! మీవంశానికి తగ్గ ట్టుంది"

"చూడూ."

"నేను చూడనండీ! అధీనం తప్పిన మీఅమ్మాయి వుండగా నాకేం చాకిరీ చేసేదాకా, మీ యింటో?"

గుండెలు దూసుకుపోయా యతనికి.

ముచ్చెమటలున్నూ పోశాయి.

వొణుకున్నూ పట్టుకుంది,

"ఏ–మి–టి–యి–వా–ళ–యి–లా—"

"నే నెలాగా యిక అత్తవారి యింటికి వెళ్ళిపోవలిసిందాన్నే కనక, వెళ్ళడానికి మంచిరోజులు కుదిరేధాకా మానాన్నారికి నేనే కాఫీ చేసి యిస్తానంటూ—"

"చేతులు కాల్చుకుంటుందో యేమిటో పాపం!"

వల్లమాలిన ఆత్రం స్ఫురించిం దతని యీమాటలతో.

"మరేమీ పరవా లేదు కంగారుపడకండి"

"ఏమన్నావ్?"

"నాకడుపున పుట్టింది కదా, ఆమాత్రం శిక్షా లేకుండా—"

"వోసి నీయిల్లు—"

"దాని ప్రాణాలకే వుచ్చు లొగ్గుతోంది మీ అమ్మ, చేతులు కాలడం అంతకంటే యెక్కువ కాదులెండి."

"ఈ టెలతో పొడిచేస్తున్నావు నువ్వు నన్ను."

"ఏమిటీ?"

"……………"

"నేనా?"

తర్జనితో తనని నిర్దేశించుకుంటూ — తల యెగరవేసుకుంటూ ఇలా అడిగింది భద్రమ్మ, కళ్ళు కూడా య్రెరజేసి.

"అవు" ననడానికి సాహసించలేకపోయాడు "కా" దని తప్పూ దిద్దుకో లేకపోయా డతను.

పైగా, తోకతొక్కిన ఆ వురగాంగన యెదట నుంచోడం కష్టం అయిపోయిం దతనికి.

మొగం చాటువెయ్యడం వొక్కటే గతి యిక.

మరో మెట్టెక్కాడు, బుర్రవంచుకుని నీరసంగా.

"వెళ్ళకండి" అందామె.

సింహనాదం అన్నట్టుం దతని కిది.

కదల్లేకపోయాడు.

చూశాడు బెదురుతూనే.

"నువ్వు వచ్చేదాకా కదలకుండా నే నిక్కడే వుంటాను, మనం పైని వుంటా మని చెప్పయినా రా పాపం అమ్మాయికి."

"నా కవసరం లేదండి."

"......వొట్టి కొయ్య" అన్నా డతను, నిష్ఠురంగా చూస్తూ,

"ధన్యురాలిని. మీయింటో బతగ్గల నన్నమాటే నేనిక,"

"జాలి అన్నది యేకోశాన అయినా—"

"మీకుంది మహా."

"ఉందో లేదో—"

"ఉంటే మీ అమ్మాయి వున్నచోటికే వెడతారు మీరు, దానికి తిప్పట యెందుకు తెచ్చిపెడతారూ?"

"..............."

"..............."

"అయితే పద."

ఇలా అంటూ కిందికి బయలుదేరా డతను.

"వస్తాను పదండి" అంటూ మీదికి బయలుదేరిం దామె

"ఓహోయ్! నువ్వే రావా యేమిటి?"

"నేను వొట్టి కొయ్యనుగా?"

"నామాట విను."

"........."

"పదిమాట్లు చెప్పించుకోక దిగి రా."

చూసిచూసి "పడమటింటి వసారాలోవుంది మీఅమ్మాయి, నేను పొందాను తీసుకువస్తాను, మీరు నడుస్తూ వుండండి."

ఇలా అంది, గబగబా నాలుగు మెట్లెక్కేసిందామె.

7

అతను కూతురి దగ్గిరికే వెడతా డనుకుంది; గాని మరో మెట్టెక్కేటప్పటికి తన పైటకొంగు దిగజారుతున్న ట్టయిం దామెకి.

చూసుకోగా, అది పట్టుకుని పైకే వస్తున్నా డతను, కొంటెచూపులు చూసుకుంటూ.

"మీరెందుకూ పైకి?" అంటూ కస్సుమం దామె, చకిత అయీ, నిలిచిపోయీని.

అప్పటి కప్పుడే ఆమె వున్న మెట్టుమీదికి వెళ్ళా డతను.

మరి కొంటెచూపులు చూస్తూ ఎడమచెయ్యి ఆమె నడుముకున్నూ చుట్టవేశాడు.

విడిపించుకోవా లంటే ఆమెకి సాధ్యం కాలేదు.

కాళ్ళు కిందిమెట్టుమీదికీ పైమెట్టుమీదికీ రాకపోకలు చేస్తున్నా, ఆ పెనుగులాటలో, బుగ్గాబుగ్గా ఆనుకునేటంతగా హత్తుకుపోయారువారు.

"ఊహూ!....వల్లకాదు....నేనొప్పుకోనండీ.....వదలండి....వినండి........ అబ్బ మెట్లమీద కట్టకట్టుకుని....ఏమోనండీ....అమ్మాయీ!"

జంకిపోయా డతను, దీంతో.

దాని కదే చెయ్యి సడలిపోయింది.

"తెలిసిందా? ఇక వెళ్ళండి" అందామె, తల యెగరవేసుకుంటూ.

"పన్నెండేళ్ళ బాలాకుమారి లాగ నువ్వు ముద్దొస్తూ వుంటే—"

"అలాగేం? అయితే యిరవై యేళ్ళనుంచి కాపరం చేస్తున్న మనమే—"

"ఇరవై యేళ్ళేమిటి ముప్పయేళ్ళు మాత్రం యేమిటి మొగుడికీ పెళ్ళానికీ—"

"మరి మొగుడు లేనివాళ్ళ మాట?"

తెల్లపోయా డతను.

"బదులు చెప్పరేం?"

"......................."

"మాట రాదేం?"

"మేడమీద చెబుతా."

"వస్తాను కిందికి పదండి, చెబుదురుగాని."

"బంగారు బొమ్మవు కాదూ?"

గడ్డం పట్టుకున్నా డతను నాళగా; కాని అతని చెయ్యి విసిరేసిం దామె, దురుసుగా.

"నాన్నా రండి" అంటూ పిలుపు వినవచ్చిం దీస్థితిలో.

"అదిగో, పలకరేం?"

మొదట తెల్లబోయాడు; కాని యింకో పిలుపు వస్తే అప్పుడు చూసుకుందా మనుకున్నా డంతలో.

"పోనీ, నువ్వెక్కడున్నావే అమ్మా?" అంటూ మరో పిలుపు వచ్చింది.

"ఏం, నీపని కూడా అయిందా?"

ఇలా అంటున్నట్టు పెదవులు బిగించుకుని తల యెగరవేసుకున్నా డతను.

"........................"

"మరి నువ్వయినా మాట్టాడవేం?" అంటూ ముదలకించా డతను.

కథ యిలా అడ్డం తిరగడం చూసి, గిరుక్కున మళ్ళి కిందికి బయలుదేరిం దామె, దేనికీ బదులు చెప్పకుండా.

"మేడమీద పని వుందన్నావు, మరి?"

అప్పటి కప్పుడే మెట్ల పక్కని వున్న ద్వారం దాటి హాల్లో అడుగు పెట్టిందామె.

"ఒక్కపూట తాంబూలం ఆలస్యం అయితే యేమీ మిగిలిపోదు" అంటూ ముందుకిన్నీ వెళ్ళిపోయిం దాబిగిని.

"నాకూ దిగడిపోదు" అంటూ అతనూ బయలుదేరాడామె వెనకనే.

8

జంకుతూనే వచ్చాడు కృష్ణశాస్త్రి, ముసలమ్మని తలుచుకుంటూ.

అందుకు తగ్గట్టు హాల్లోనే సాక్షాత్కరించిం దామె.

ఇక్కడికి నాలుగు దినాలనుంచి ప్రయత్నం, గిల్లి కజ్జా పెంచాలని ఆమె.

అతనే తప్పించుకు తిరుగుతున్నాడు, మెళకువగా.

దినాలు గడిచిన కొద్ది ఆపట్టుదల యెక్కువయిపోతోందామెకి.

అతని రూపూ రేఖా చూడనక్కరలేదు, తలుచుకుంటేనే రోషం వస్తోం దామెకి.

నిద్రాహారాలు తప్పిపోతున్నాయి.

శాస్త్రి కిది తెలుసు.

అతనికి యెక్కు వవుతోంది పట్టుదల.

అయితే, అసలే కార్యవాది అతను.

నలుగురితోనూ మంచిగా వుండి నాలుగు డబ్బులు సంపాదించుకోవా లన్న దీక్షతో వున్నా డతను.

లేకపోతేనా అతనే కజ్జా పెట్టుకుని వుండును, మొదట.

పైగా,—సుందిరి తెలివితేటలు చకితుణ్ణి చేస్తున్నాయి.

ఆమె చూపులు మధురభావనలు రేపెడుతున్నాయి.

భద్రమ్మ కనపరుస్తూ వున్న గౌరవాదరాలు ఆశాజనకాలుగా వున్నాయి.

అంచేత కూడా చాలా వోరిమి చూపిస్తున్నా డతను.

"ఇది నిర్లక్ష్యమా, చేతకానితనమా?" అని వెంకుసోదెమ్మ జిజ్ఞాస.

ఏమయినా ఫలితం వొకటే—సహించలేకపోతోం దామె.

మరేమిటీ చెయ్యడం?

తాను పరమవిధేయు డనుకుంటున్న తన కొడుకు తనకి లాగే భద్రమ్మకిన్నీ పరమవిధేయుడే, స్పష్టం అయిపోయిం దిప్పుడామెకి.

నిన్నటిదాకా కుక్కిన పేనయి వుండిన కోడలు కొరకరాని కొయ్య అయిపోయింది, క్షణంలో.

పోనీ అంటే,—మనమరాలు—తన దౌహిత్రుని పెళ్ళాం—తన కూతురి కోడలు తను బతికివున్నట్టే చూడ్డంలేదు.

సాటి ముసలమ్మలున్నూ "ఇదేం పోయేకాలమే" అంటూ వుండేవారు నిన్నటిదాకా; కాని యిప్పుడు "కాలం యిలా మండిపోతోంది. మనం బతికి వుండినా చచ్చినవాళ్ళలోనే జమ. నీపెత్తనం సాగనప్పుడు, పువ్వు లమ్మిన వూళ్ళో కట్టె లమ్మడం యెందుకూ? కాకపోయినా, చెవులారా వింటూ కళ్ళారా చూస్తూ యిలా కుమిలిపోవడం కంటే యేమాత్రమో పిల్లిపిల్లని జాగ్రత్తచేసు కునే వున్నావు కదా నెత్తిమీద కూడా పెట్టుకుంటుంది గదా నీకూతురు. పోనీ, కాకినాడే వెళ్ళిపోతే యేం?" అంటూ నరాలు కుంగదీసేస్తున్నారు.

నిజమే; కాని "అధీనం తప్పినవాళ్ళకి దేవుడు రాసిపెట్టిన సైనుపంచెలు కాకపోతే మానె, సుందరమ్మచేత చివరికి గ్లాస్కో మల్లు పంచెలయినా కట్టించి మరీ వెడదా" మని చూస్తోందామె.

అందుకోసం క్షణాలు లెక్కపెడుతూ ముళ్ళమీద వుంటోంది.

ఆలోచనమీద ఆలోచన చేస్తోంది.

ఎత్తుమీద ఎత్తువేస్తోంది.

కుట్రమీద కుట్ర పన్నుతోంది.

"మాలకూడు" బలిసిపోతున్న వోపికపట్టుకునిన్నీ వస్తోంది.

అయితే, తా ననుకున్న పని జరగా లంటే ముందు కృష్ణశాస్త్రికి వుద్వాసన చెప్పాలి.

వొట్టి వుద్వాసన చెబితే చాలదు, ప్రాయశ్చిత్తం కూడా చెయ్యాలి.

గుమ్మమే యెక్కనివ్వకుండా వీధిలోవాణ్ణి వీధిలోనుంచే పంపెయ్యాలి.

ఎప్పటి కయినా తానే చెయ్యాలి కూడా ఆపని.

సుఖసుఖాల అయే పని కాదు.

కోడ లిందు కడ్డుపడుతుంది.

మనమరా లెదురుకుంటుంది.

ఇక కొడుకా "వాజమ్మ" రగడ ప్రారంభం అయితే యింటోనే వుండశే డావేళకి?

అయితే, తన కిది సాధ్య మేనా?

పరకాయించుకుందా మె.

సాధించా లనుకుంది.

"సాధించితీరా" లనుకుంది.

మరి దారి?

ఆలోచించసాగింది.

ఆలోచిస్తూ, హాల్లో, కవాచీబల్లమీద కూచునివుం దామె, యీ చూపుతో.

9

సరిగా యిలాంటి సమయాన వచ్చాడు కృష్ణశాస్త్రి.

ముసలమ్మ యేడుస్తున్నందు కన్నట్టు పట్టంచుల పంచె కట్టుకునే వున్నా డతను.

పట్టు షర్టే తొడుక్కునీ వున్నాడు.

నోట తమలం వుంది.

బట్టలు ఘమఘమలాడుతున్నాయి.

మెడలో, సేలం పట్టుకండువామడత తావళంవతుగా మిలమిల్లాడుతోంది.

అతని వర్చస్సు చకచ్చకితం అవుతోంది. ఆవేశంతో.

ముసలమ్మకి కళ్ళు కుట్టాయి, ఆరూపం చూడగా.

తుమ్మల్లో పొద్దుగూకిన ట్టయిపోయిం దామె, మొగం, దాంతో.

అది గుర్తించా డతను.

"ఏదో తలుచుకుంది మళ్ళీ" అనిన్నీ పసికట్టాడు; కాని నిశ్చలంగా గుమ్మం యెక్కాడు, మొగం వంచుకుని.

ముసలమ్మ అనుకోని సన్నివేశం అది.

అతను నిర్లక్ష్యంగా వస్తా డనుకుం దామె.

విర్రవీగుతూ దురుసుగానున్నూ వస్తా డనుకుంది.

అందుకు తగ్గ ధోరణి వూహించుకునిన్నీ వుంది, సిద్ధంగా.

కాని, యిది చూసి నిర్విణ్ణ అయింది.

పోనీ అంటే యిదీ ఆగ్రహకారణమే అయిం దామెకి.

"ఇక మెత్తమెత్తగా చెబితే లాభం లే"దనుకుంది.

అయితే, మొగం వంచుకుని వున్నాడే కాని తనున్నూ పట్టుదలగానే వున్నాడు.

"మన కీ అడ్డేమి" టనుకున్నా డతను.

"రామబ్రహ్మంగా రుండగా యీవిడ యెవరు రమ్మనడానికయినా పొమ్మనడాని కయినా?" అనుకున్నాడు.

అగత్యం అయితే "నీ లెక్కేమిటి?" అనడిగెయ్యా లని గట్టిగా నిశ్చయించుకున్నాడు.

దానా దీనా యిద్దరి మనస్సులూ గుబగుబలాడిపోయాయి.

ఇద్దరి చూపులూ నిశితా లయిపోయాయి.

ఇద్దరికీ ఆవేశం హెచ్చిపోయింది.

ఇద్దరి కాళ్ళలోనూ మెరుపువేగం అంకితం అయింది.

వెంటనే, అడ్డంగా నుంచుని అతను హాల్లో అడుగు పెట్ట కుండా చేదామని గబీ మని గుమ్మంలో కొక్క గంతు వేసిందామె, ఇటు చూస్తూ.

ఆమె నేడిపిద్దా మని అంతకంటే పెద్ద అంగవేసి గుమ్మం దాటేశాడంతకి ముందే అతను, అటు చూస్తూ-

కాని చిన్నతనం.

ప్రతిభ వుందే కాని అనుభవం చాలదు.

కాగా "ఇంకేం చేస్తా" వన్నట్టు డెకారిస్తూ చూశా డతను, ఠీవిగా నుంచుని.

"ఇలా వచ్చావా?" అనుకుం దామె.

"తొందరపడకోయ్" అనిస్నీ అనుకుంది.

మెరు పయిపోయింది, నిజంగా.

వెళ్ళి, మండువా హాల్లో నున్న ద్వారాని కడ్డంగా నుంచుంది, మరో అంగలో వెళ్ళి.

"ఇం కేం చేస్తా" వన్నట్టున్నా చూసింది, కనుబొమ్మ లెగర వేసుకుంటూ.

అప్పటికి తెలిసింది కృష్ణశాస్త్రికి, విజయం తనది కాదని.

"అరే" అనుకున్నాడు, నాలుక కరుచుకుంటూ.

అబిగిని బిగిని తానా గుమ్మం దాటెయ్య నందు కెంతో పిసుకున్నాడు.

"ఏమిటీ దారి?" అంటూ ఆలోచన ప్రారంభించాడు చివరికి.

అప్పటి కప్పుడే పతకం మార్చి మెల్లిగా అందుకుంది ముసలమ్మ అమాయికత్వం నటిస్తూ.

"ఆడపిల్లలకే గాని మొగపిల్లలకు చదువు చెప్పలేవా యేమిటబ్బాయీ నువ్వు?"

"ఏం, చెప్పలేకేం?"

"........................"

"దానికి దీనికి భేదం యేమిటీ?"

"ఏమో, చదువంటే యేమిటో నాకేం తెలుసునా, యేడుసునా?".

"అది నిజమే. మరి అలా అడిగారేం?"

"తెలుసుకుందామని."

"మీరు ఆడవాళ్ళకీ మొగవాళ్ళకీ గూడా వండి వడ్డించగలరు, కాదూ?"

"అయితే?"

"అలాంటిదే యిదీని."

"ఊహూ."

"డబ్బెవరిస్తే వారికందరికీ చెబుతాను నేను."

"అలాగా?"

"చదువుకావలసినవాళ్ళు కూడా ఇలాంటి భేదం చూసుకోరెవరూ."

"........................"

"యాభై యేళ్ళ యిల్లాలు, డాక్టరు పేరిశాస్త్రిగారి కూతురు జగదాంబ గారు సవ్యాఖ్యానంగా రామాయణం చదువుకుంటున్నారు నాదగ్గిర."

"ఆఁ!"

"మీయింటి వెనకనే వున్న తారకావధానులుగారి కూతురికి మనుచరిత్ర పాఠం చెబుతున్నానిప్పుడు, తెలుసా?"

"ఏమో, మాకాలంలో యెవరూ యెరుగరులే యిలాంటివి."

"ఈకాలంలో యెరగనివారు లేరులెండిలాంటివి"

ఇది యెద్దేవా అని గుర్తించేసిందామె.

తానూ దండకం విడేద్దా మనిన్నీ నిశ్చయించుకుంది,

"ఎక్కణ్ణుంచీ అందుకోడం?" అని మాత్రం చూసుకుంటోంది.

మాట కూడా నాలుక చివరికి తెచ్చుకుంది; కాని ఉండుండి "చదువుకోక పోయినా, మీకాలపు ఆడవాళ్ళలో కూడా చదువుల విలవలు తెలిసినవారు చాలా మందే వున్నారండీ, అమ్మమ్మగారూ" అన్నాడతను కొంటెగా చూస్తూ.

ఇక్కడ మీట నొక్కితే దీపం వెలిగి అక్కడ గప్పుమంటుంది బల్బు.

అతనీమాట అన్నాడు మెల్లిగా, ఆమెకి కోపం వచ్చేసింది, చర్రున.

అగ్గిమీది గుగ్గిలమున్నూ అయిపోయి "చాల్లే నేర్చుకుపోయావ్; నేనమ్మమ్మనా నీకు?" అంటూ కస్సు మంది, వెంటనే.

గతుక్కుమన్నాడు కృష్ణశాస్త్రి; కాని సంగతి అతని కర్థం అయిపోయింది.

బుద్ధి చమత్కృతమున్నూ అయింది.

"ఎందుకవుతారూ" అని యెదురడిగాడు, ముంగోపమున్నూ నటిస్తూ.

"మరెందుకు పిలిచావలాగ?"

"మాఅమ్మమ్మ వయస్సులో వున్నారు మీరు, దినమ్మూ యింటో ఆవిణ్ణి పిలిచే అలవాటుండి, అలా వచ్చేసింది, మాట."

"పోనీ, నాయనమ్మా అనలేవూ?"

"అలా మాత్రం యెందుకనాలీ?"

"ఎందు కనాలా?"

"అవు నెందు కనాలీ? మానాయనగారిని మాత్రం కనిపెంచేశారా యేమిటి మీరు, మహా?"

"........................"

"మానాయనమ్మ యజ్ఞంచేసింది. ఎన్నోమాట్లు వాల్మీకి రామాయణం పురాణం చెప్పింది. కాశీవెళ్ళింది. ఒక్క బ్రాహ్మడి కయినా హస్తోదకం యివ్వకుండా పచ్చిమంచినీళ్ళయినా పుచ్చుకునిన్నీ యెరగ దెన్నడూ, తెలుసా?"

"అసలు, నన్ను వరసపెట్టి యెందుకూ పిలవడం?"

"వరస పెట్టకుండా మాత్రం మిమ్మల్ని పిలవ్వవలసిన అగత్యం యేమిటీ నాకు?"

"మరెందుకు పిలిచావ్?"

"మీరెందుకు పిలిచారూ మొదట నన్ను?"

"అబ్బాయీ అన్నాను, తప్పా?"

"అందుకే అమ్మమ్మగారూ అన్నాను, తెలుసా?"

తెల్లపోయిందామె.

మిడుతూ మిడుతూ చూస్తూ వుండిపోయింది, అయ్యో అయ్యో అంటున్నట్టు బోసినో రవ్వళించుకుంటూ.

ఈసందుబాట్లో, ఆమెని తప్పించుకుని మండువాలోకి చూడ్డానికి కొంచెం పక్కగా జరిగాడతను, ముందు.

సుందరీ అంటూ గట్టిగా పిలిచాడు, మోర యెత్తుకుని తరవాత.

ఆపిలుపులో చనువూ, అంతకంటే యెక్కువగా ప్రేమా మరేమిటో కూడా ధ్వనించా యామెకి.

"బిక్కమొగం వేసుకుని కిష్టప్ప యెదురుగా నుంచున్నట్టయిందామెకి, దీంతో."

అభిమానమూ, రోషమూ, క్రోధమూ గుంజేశాయామెని.

"అమ్మాయిగారూ!" అంటూ రుంజుకుంది, దాంతో. బదులు చెప్పలేదతను.

అటయినా చూడలేదు.

"మాట్టాడవేం?" అందామె, వొణికిపోతూ.

"....................."

"నిన్నే వినపడదూ?"

"....................."

"చెవులు కొరికేశారా భాములు?"

తుళ్ళిపడ్డా డీమాటమీద అతను.

అరికాలి మంట నెత్తికి వచ్చింది.

కాని, అంత రోషంలోనూ కూడా బుద్ధి చమత్కృతం అయింది.

దానికి సాయం కొంటెతనమున్నూ వచ్చింది.

"సుందరీ" అంటూ మళ్ళీ పిలిచాడు వెంటనే అంతకంటే ప్రేమ స్ఫురింపచేస్తూ.

గుండెల్లో పొడిచిన ట్టయిం దామెకి, దాంతో.

"అంతకంటే నోరు తిరగదూ నీకూ?"

"...................."

"ఎక్కడ నేర్చుకువచ్చా వీపిలుపు?"

"...................."

"నాలుకా తాటిపట్టా నీది?"

మాట పడలేక అతనూ, బదులు మాట లేక ఆమే కూడా అగ్గయిపోయా రప్పటికి.

అతను నిప్పులు కక్కుతూ చూడగా, గబీ మని లోపలికి వెళ్ళి ఫెడీ మని తలుపులు బిగించేసుకుందామె, ధుమధుమలాడు కుంటూ.

10

ఏమిటీ చెయ్యడం?

లోపలికి వెళ్ళడానికి వీలు లేకపోవడమే కాదు, పిలు పయినా అందదు.

వెళ్ళిపోదామా?" అనుకున్నా డతను, మొదట; కాని, "ఛా, అదేం పని?" అనిపించిం దంతలో.

"ఇదివరలో అలా చెయ్యడమే తప్పయిపోయింది" అనుకున్నాడు, చూసిచూసి.

"ఏమయినా—యిదేమిటో తేల్చుకోవా" లనిన్నీ నిశ్చయించుకున్నాడు.

"ముసలిదాని కంటో కారం చల్లితీరా లివాళ" అనిన్నీ నిరుకుచేసు కున్నాడు.

అందు కుపాయం ఆలోచించుకుంటూ తలుపు దగ్గిరికి వెళ్ళాడు.

సందుల్లోంచి చూడగా, పడమటింటిలో నుంచి మండువా హాల్లోకి వస్తోంది భద్రమ్మ, యెందుకో.

వెంటనే తలుపు కొట్టా డితను, మాట్టాడకుండా.

మళ్ళీ కొడదా మనుకుంటూ వుండగా తలుపు తెరుచుకుంది.

"మీరా?" అనడిగింది, భద్రమ్మ.

"నేనేనండి" అన్నాడు కృష్ణశాస్త్రి, వెనక్కి తగ్గి.

"ఎంతసే పయింది వచ్చి?"

"పావుగంట అయింది."

"పిలిచారా?"

"రెండుమాట్లు—"

"మీరు వచ్చాటప్పటికే తలుపు వేసివుందా?"

"లేదండి, నేను వచ్చాక గూడా చాలా సేపు తెరిచే వుంది."

"మొగం మాడిపోయిన ట్టుంది, ఏమయినా అందామిమ్మల్ని?" అనడిగిం దామె యివతలికి వచ్చి? కంఠం నొక్కుకుని.

కాని కృష్ణశాస్త్రి మాత్రం గట్టిగానే అన్నాడు "అంటే మాత్రం యేమిటి లెండి, మీరేమీ పట్టించుకోనక్కరలేదు" అని.

"అస లెందు కనాలీ?"

"...................."

"నావాకట్లోకి మనిషి రావడం భయం, ఇక కళ్ళల్లో నిప్పులు పోసు కోడమే."

"........... ...."

"ఎన్నేళ్ళు వస్తే యేమిటి సిగ్గూ బిడియమూ లేకపోయాక?"

"...................."

"పగ వున్నచోట అంటే ప్రేమ వున్నచోట తగులుతుంది, తెలుసుకో గలిగితే."

చాలా గట్టిగా—ఝూంకారంగా అం దీమాటలు మండువాలోకి చూస్తూ, భద్రమ్మ.

దీనిమీద రగడ పెరుగుతుం దనుకున్నాడు కృష్ణశాస్త్రి.

రగడకు బదులు సుందరి వచ్చింది పడమటింటో నుంచి "ఏమిటే అమ్మా, అదీ?" అనడుగుతూ.

"ఏముందీ చెప్పడానికి? మామూలు రోకటి పాటే. అయితే, కాఫీ యేమ యినా మిగిల్చావా, అంతా—"

"ఉన్న దంతా అలాగే వుంది, నేనింకా పుచ్చుకోనే లేదు."

"అయితే, శాస్త్రిలుగారికి—లోపలికి రండి నాయినా."

"...................."

"జరిగింది మరిచిపోండి, ఏల్నాటిశని మమ్మల్నింకా విడిచి పెట్టలేదు. అంతవరకూ మాతో పాటు మీకూ తప్పవు తిప్పలు."

"తిప్పల కేం గానీ—కృష్ణవేణమ్మగారి యింటో నేను కాఫీ పుచ్చు కునే—"

"మాయింటో కూడా పుచ్చుకుంటే గాని వీల్లేదు."

"నామాట—"

"నన్ను చంపుకుతిన్నట్టే పుచ్చుకోకపోతే, పదండి. పీట వెయ్యి తల్లీ!

ఎందుకూ, కాఫీ లయినాక మావాళ్ళ యింటికి వెళ్ళి దీనికి విరుగుడు చూసి రానూ, నిమిషంలో?"

మాట్టాడకుండా ముందు సుందరీ కృష్ణశాస్త్రి పడమటింటోకి బయలు దేరారు.

తన గదిలోనుంచి తొంగిచూస్తూ ముసలావిడా, గబగబా పడమటింటోకి వెడుతూ భద్రమ్మా కొరకొర చూసుకున్నారు, తరవాత.

11

మర్నాటి మధ్యాహ్నం రెండు గంటలవేళ కింది పడకగదిలోంచి వస్తూ రామబ్రహ్మమూ, ఆగదిలోకె వెడుతూ భద్రమ్మా గుమ్మంలో తారసిల్లారు.

"ఎక్కడికో ప్రయాణం కామోసు" అంది భద్రమ్మ.

"అవును."

"మళ్ళీ గదిలోకి పదం డొకమాటు, తరవాత యెలాగా బయటికి వెళ్ళాలి."

"ఒక్కమాటేం పదిమాట్లు వస్తాను, పనేమిటి?"

"ఇనప్పెట్టి తాళం తియ్యాలి."

ఉలిక్కిపడ్డా డతను.

అప్పుడే తాళం వేసి వస్తున్నాడు.

ఉన్నడబ్బు లెక్కపెట్టుకుని, బడ్జెట్టున్నూ నిర్ధారణ చేసుకుని యివతలికి వస్తున్నాడు.

మిగులే కనపడ్డందు కుత్సాహంగానూ వున్నాడు; గాని మళ్ళీ తాళం తియ్యడం వచ్చాటప్పటికి తెల్లపోయాడు.

"చూస్తా రేం పదండి" అందామె.

"ఎందు కేమిటి?"

"డబ్బు కావాలి."

"ఏం చేస్తావ్?"

"అమ్మాయికి బట్టలు కొనాలి."

గుండెదడ తగ్గింది.

యాభై అరవై కంటే యెక్కువ తీసుకో దనుకున్నాడు; కాని యెందు కయినా మంచి దని "యేమాత్రం కావా లేమిటి?" అనడిగాడు.

"కావాలి."

"ఏమాత్రం—"

"పెట్టితియ్యండి, మీరు మిగిల్చిందెంతో చూడాలి, ముందు."

"...................."

"తెల్లపోయి నుంచుంటేకాదు"

"...................."

"అమ్మాయిచేత మల్లుపంచెలు కట్టిద్దా మని చూస్తోంది మీఅమ్మ, సాగనివ్వను నేను"

"...................."

"ఇప్పటిదాకా వుప్పాడచీరలతో సరిపెడుతున్నాను, ఇక దక్షిణాది చీరలు కొంటాను, తెలిసిందా?"

"లోకం—"

"కుళ్ళి కంపెత్తిపోతుంది, అంతేనా?"

ఆమె దీక్ష ఆసాధారణం అని గుర్తించుకున్నా డతను.

"దీని కంతకీ కారణం ముసలావిడ" అనుకున్నాడు.

"ఆమె యేటి కీదుస్తూ వుండడంవల్లనే యీామె కోటి కీదుస్తోం"దని నిశ్చయించుకున్నాడు.

తనకి మాత్రం ప్రాజాపత్యం కనపడలే దతని కింటో.

ఇద్దరికీ తానే లోకువ.

పోనీ అంటే, ఆయిద్దరికీ జవాబు చెప్పవలసిన బాధ్యత మాత్రం తనది.

కష్టం తోచింది.

అభిమానమున్నూ వచ్చింది.

కాని స్వతంత్రిద్దా మంటే సంసారభారం అంతా మీదవేసుకోవాలి, మరి.

క్లబ్బుకి వెళ్ళడం మానుకోవాలి, తరుచు.

నిజమే; కాని "ఆపని చేస్తే యిక జీవితంలో యేం వుందీ?" అనిపించిది.

చూసి వూరుకున్నాడు, చివరికి.

"పదండి" అందామె, చురుగ్గా చూస్తూ.

"...................."

"తొరగా తెమల్చా లండీ"

"మరోమాటు—"

"వల్లకాదు"

"నామాట విను"

"తాళం తీస్తారా తియ్యరా?"

"వారం రోజుల్లో నేను చెన్నపట్నం——"

"వల్లకాదు"

"ఏమిటి వల్లకానిది" అనిపించిం దతనికి.

"దేశదేశాలనుంచీ ఖండఖండాలనుంచీ టెన్నిస్ ఆటగాళ్ళు వస్తున్నారు వాళ్ళని చూడకపోతే జన్మయెందుకూ?"

"తన ఆట కూడా వాళ్ళకి చూపించాలెలాగో వొకలాగు లేకపోతే——"

వొణికిపోయా డతను

"నడవండి, నడవండి. ఇవాళ అమ్మాయికి కొత్తబట్టలు కట్టబెట్టితీరాలి. నాలుగ్గంటలవేళ కట్టుకోడానికి ముహూర్తం స్థిరపరిచివెళ్ళారు వెంకటావధానులు గారు, తెమలాలి"

"...................."

"అమ్మాయీ నేనూ బజారుకు వెళ్ళి రావశానికి జట్కా కూడా తీసుకు రావాలి మీరు, చూస్తే కాదు"

ఇలా అంటూ రెండు జబ్బలూ పట్టుకుని ఇటున్న వాణ్ణి అటు తిప్పిం దామె, ముందు.

ఎడమచేత్తో పొదివి పట్టుకుని రెండడుగులున్నూ వేయించింది, తరవాత.

విధిలేక బయలుదేరా డతను; కాని పెట్టెదగ్గిరికి వెళ్ళాక మళ్ళీ స్థాణువు లాగ నిలిచిపోయాడు, నీరసంగా చూస్తూ.

"కానివ్వండి" అందామె, పెట్టె చూపిస్తూ.

"కానివ్వడానికభ్యంతరంలేదు. అయితే, అయిదువందల పైచిలుకే వుంది, ప్రస్తుతం"

"చాలు, ఆరోధి"

"చాలు నంటే మరి నామాట?"

"అంటే?"

"ఇప్పటి కొక్క వంద పుచ్చుకో"

"చాలదు"

"సద్దుకో, పదకొండు వందలు చెరుకుతోట శిస్తూ, పదిహేను వందలు మిరపతోట శిస్తూ, రెండువేలు మామిడితోట శిస్తూ మళ్ళీ వారం——"

"వారం కాదు, వొక్క దినం——వొక్కపూట——వొక్క గంట కూడా ఆగడానికి వీల్లేదు, నా కిప్పుడే కావాలి, పూర్తిగా"

"ఎందుకు చెప్పానో——"

"నేనెందుకు చెబుతున్నానో——"

"నామాట బొత్తిగా కొట్టెయ్యకు. నాకూ బాధ్యత వుంది యే కొంచెమో—"

"ఈ వుపోద్ఘాతం అంతా యేమిటండీ?"

"నాకూ కావాలి డబ్బిప్పుడు"

"ఎందుకో?"

"............ ......"

"రహస్యమా?"

"..................."

"మీఅమ్మని కాశీ పంపుతారా?"

"..................."

"టెన్నిస్ బాటు కొంటారా, వున్నవి రెండూ చాలక?"

"..................."

"సమాజంవాళ్ళకి టీపార్టీ—"

"అబ్బ, చెప్పేదాకా చంపుతావు నువ్వు"

"మొదటే మీరు చెప్పేస్తే—"

"మూడువందల యాభై రూపాయ లిమ్మని కొడుకుని పంపించింది మాఅక్క"

"ఓహో!"

"..................."

"అందుకా దీక్షితులు రాక?"

"........... ...."

"నాకు తెలియకుండా—"

"చేబదు లివ్వడానికి భయ మెందుకూ?"

"చేబదు లంటే పద్దూ నోటూ అక్కర్లేకుండా వారం పది దినాల్లో మళ్ళీ యిచ్చేసి బాకీ కంటారు"

"అవును. నాలుగు దినాల్లోనే పంపేస్తుందిట, మాఅక్క?"

"ఆనాలుగురోజులూ అరువు దొరకదటనా?"

"..............."

"నెలకి రెండువేలు సంపాదించే కాకినాడ ప్లీడరుగారి యజమానురాలికి రాజమహేంద్రవరంలో — మీదగ్గిర తప్ప చేబదులు పుట్టదా?"

"..............."

"ఏమన్నా రింతకూ మీరు?"

"సరే" అన్నాను.

"అంటారు మీరు, సందేహమా?"

"..............."

"మెడలు వంచి మీఅమ్మ అనిపిస్తుంది, నాకు తెలుసు"

"..............."

"మొన్నటి దాకా కొంప దోచారు, చాల దటనా?"

"..............."

"నాలుగు మాసాల కిందట వెయ్యిరూపాయిలు చేబదులు తేలేకపోయారు మీరు వారి దగ్గిరనుంచి—"

"ఏమయితేం, యిప్పటికి—"

"పనికిరా దండీ"

చూసిచూసి, తన అసమ్మతి నిట్టూర్పు రూపంగా ఉద్ఘాటించి, పెట్టె తెరిచి పక్కగా నుంచున్నా డతను.

తివాసీ పెట్టె దగ్గిరికి లాక్కుని కూచుంది, భద్రమ.

సొరుగు లాగింది.

వందది వొకటి, కొన్ని పదులు, కొన్ని అయిదులూగావున్న నోట్లకట్ట అందుకుంది.

'ఈ రెండు వందలూ అమ్మాయి బట్టలకు. ఈనలభయ్యీ శాస్త్రిలు గారికి రెణ్ణెల్ల జీతం. అమ్మాయి పరిక్షలో నెగ్గింది కనక, ఈనూటపదహారూ ఆయనకు బహుమానం, ఈపాతికా నాదగ్గిర వుండాలి, చిల్లర ఖర్చులకు. ఈనూరూ, ఎందుకయినా అవసరం కావచ్చు, అమ్మాయి దగ్గిర వుంటాయి. ఈపాతికా శాస్త్రిలుగారికి జామారు—"

"..............."

"మిగిలినవి—"

"ఇక డెబ్బయి మిగిల్చావు"

"మరి సంసారమో? నేతిమనిషి నూనె మనిషీ గోలపెట్టేస్తున్నారు. పాలవాడు కాళ్ళావేళ్ళా పడుతున్నాడు, యాభై రూపాయలు అడ్వాన్సు కావాలంటూ. కాఫీగింజలు తేవాలి. పంచదార చిటికె డయినా లేదు పొద్దుటకి—"

"కిరాణాకొట్టు మనిషిని రేపు పొద్దుట రమ్మన్నావు కదా మరి?"

"మీరు మరో రోజున రమ్మనండి, మించిపోయిం దేముందీ?"

"మర్యాద అక్కర్లేదు"

"కావాలి కనకనే మరోనా డివ్వడం"

"కాస్త భాగ్యానికి రెండుమాట్లు తిప్పడం—"

"మీఅక్కకి తప్ప మరెవరి కిచ్చారండీ, అడిగిన వెంటనే మీరు?"

"................"

"మీఅక్కకి సమర్పించుకోడం కోసం అమ్మాయికి లేదన్నారు మీరు, మళ్ళీ రమ్మనడం అలాంటిది కాదుగా?"

"................"

"అలా చూస్తూ నుంచుంటే కాదు, తాళం వేసెయ్యండి"

"ఇక తాళం వేసినా వొకటే, వెయ్యకపోయినా వొకటే"

"అలా చేశారు మీరు"

"అదేమిటి?"

"మొన్న మీ పెద్ద మేనల్లుడు వచ్చాడు, అత నెంత పట్టుకు వెళ్లాడో?"

"ఆ, ఆ"

"లేవండి లేవండి, మేము బయలుదేరాటప్పటికి జట్కా తీసుకు రావాలి మీరు"

"................"

"అలా నుంచుంటే ముహూర్తం దాటిపోతుంది, కదలండి"

"................"

"నేనూ అమ్మాయీ బజారు నుంచి వచ్చేదాకా మీరింటో వుండాలి సుమండీ, తరువాతే క్లబ్బుకి వెళ్ళడం"

12

కొట్టేసిన పాములాగ పడకకుర్చీలో వాలి వున్నాడు రామబ్రహ్మం, కింది పడకగది వసారాలో.

అతని మొగమంతా అతిజటిలంగా అలుముకుని వుంది, వైరాగ్యం.

నిజానికి, కేవలమూ వైరాగ్యమూ కాదిది—దెబ్బతిన్న సిగ్గు, చేతకాని దైన్యం, స్వతంత్రించలేని అభిమానం—ఏమిటేమిటో మిశితం అయి వుందది.

చేతి కందేటట్టున్న గులాబీ పువ్వులమీద ఎగిరెగిరి వాలుతున్నాయి, గండుతుమ్మెదలు.

వసారాదూలంమీద గూడుకట్టుకుంటూ కిచకిచలాడు తున్నాయి, పొట్టి పిచికలు.

ఒకవైపునుంచి నెమలి కేకలూ, మరో వైపునుంచి కోకిల కుహూకూజితాలూ, యెదటి మేడమీదనుంచి ఆగిఆగి వీణా నినాదమూ వినవస్తున్నాయి.

అయినా చలనం లేకుండా పడివున్నా డతను.

మొగాన యీగ వాల్తే — వాలి, తిష్ఠవేసి, పొటుక్కున్న పొడిస్తే విదిలించుకుంటున్నా డతను, వులిక్కిపడి, అంతే.

"నాన్నారండీ" అంటూ చక్కావచ్చింది, సుందరమ్మ ఈస్థితిలో. ఉలిక్కిపడ్డా డతను.

చూడగా, కళ్ళు జిగజిగలాడిపోయాయి.

కూతురి సౌందర్యం అంత స్ఫుటంగా చూడలే దత నెప్పుడూ.

కాని, కళ్ళు చెమ్మగిల్లాయి జిగాలుమనడం తడువుగా.

మాట్టాడలేకపోయాడు.

కదలనూ లేకపోయాడు.

"ఈచీర బాగుందా నాన్నారూ?" అంటూ యెదటికి వచ్చి నుంచుంది, సుందరమ్మ,

"నిక్షేపంలా వుంది. అయితే వెల—"

"నూట యాభై మూడున్నర"

"అంత వెలా చేస్తుంది. నికు చక్కగా కుదిరింది కూడా"

"మరి, దణ్ణం పెట్టుకుంటాను, పాదా లివ్వండి నాన్నారూ"

కాళ్ళు కిందికి వుంచి సటాగ్గా కూచున్నా డతను, అప్రయత్నంగా.

రెండు చేతులా అతని పాదాలు ముట్టుకుని కళ్ళ కద్దుకోసాగిం దామె.

అద్దుకుంటూనే వుండిపోయింది, కూడా.

"ఎంతసేపు తల్లీ! ఇక చాలమ్మా" అంటూ రెక్క పట్టుకుని ప్రేమతో లేవతీశా డతనే ఆమెని.

చూడగా, బాష్పప్లావితా లయి వున్నా యామె కళ్ళు.

గుండెలు కొట్టుకున్నా యతనికి.

డగ్గుత్తిక కూడా పట్టుకుంది.

అయినా "నేనేం చెయ్యను తల్లీ? నాఆశ లన్నీ నిరాశ లయిపోయాయి. నేను దురదృష్టవంతుణ్ణి, పాపాత్ముణ్ణి. చేతులారా నీబతుకు పాడుచేశాను. నాకిక పుట్టగతులు లేవు. మేమింతే పెట్టిపుట్టాము. మా అమ్మవు కాదూ? ఊరుకోతల్లీ" అన్నాడు, సప్రయత్నంగా మాట తెచ్చుకుని చివరికి.

"పిఠాపురం వెడుతున్నాను, నాన్నారూ"

"ఎందుకు తల్లీ?"

"వాళ్ళ జానకమ్మ కూతుర్ని తొట్టిలో పెడతా రివాళ" చిన్నమ్మమ్మ వచ్చి "మరీమరీ రమ్మని చెప్పి వెళ్ళిం దండి"

"దీపాలు పెట్టాటప్పటికి వచ్చేస్తావా?"

"వీలుపడదు నాన్నారూ"

"అదే మమ్మా?"

"..............."

"పోనీ, మీ అమ్మ—"

"రాదుట"

"ఏం?"

"ఆవిడ మనస్సు బాగాలేదుట"

"చేతికి వచ్చినంతా డబ్బు పుచ్చుకునీ కూడా యిప్పు డిదేమిటీ? అను కున్నా డతను.

"ఏం వచ్చిందీ?" అనిన్నీ అడిగాడు, కూతుర్ని.

"నాన్నమ్మా అమ్మా మాటా మాటా—"

"ఎందుకూ?"

"అత్తయ్య కొడుకు డబ్బుకోసం వచ్చాడుట కాదూ?"

"అవును........వస్తే?"

"నాకూతురికి పంపకుండా అడ్డుపడతావా?" అంటూ ఆవిడా "నాకూతురికి లేకుండా చేద్దా మనుకున్నావా?" అంటూ—

"ఇప్పుడు చల్లారిపోయిందా?"

"నాన్నమ్మ చంద్రమ్మత్తగారింటికి వెళ్ళిపోయింది లెండి, ఆల్కాటు తోటకి"

"బతికాం" అన్నా డతను; కాని వచ్చాక తనతో యేమి రగడ పెంచు తుందో అని భయంగానే వుందతనికి.

"జట్కా తెచ్చిపెట్టరూ నాన్నారూ"

"రానూ పోనూ—"

"పోనే, రాను వద్దండి"

"అదేం?"

"అక్కడ యెంత సేపుండాలో మరి"

"పిల్లని తొట్టెలో పెట్టడం భాగ్యానికి—"

"రానివ్వ రేమోనండి"

"ఎందుకు రానివ్వరూ? వచ్చెయి తల్లీ"

"ఏం, రాకపోతే యేమిటి నాన్నారూ?"

"నువ్వు బంతిలో లేకపోతే నాకు భోజనం—"

"అలవాటు చేసుకోండి నాన్నారూ"

"ఏం, అలా అంటున్నావేం తల్లీ?"

"నేనిక అత్తవారి యింటికి—"

"మా అమ్మవు కాదూ? మాతల్లివి కాదూ? ఆమాట యెత్తకు. అదీ మరిచిపో. కాకపోయినా, ముసలావిడ మాట కంత పట్టిం పెందుకు తల్లీ?"

"పట్టిం పేముందీ యిందులో? ఏమయినా, యెక్కడున్నా మీ అన్నమే—"

"అదేమిటి మళ్ళీ?"

"కావలసినప్పు డల్లా యెవరినో పంపి యిక్కణ్ణుంచి—" ఉలిక్కిపడ్డాడు రామబ్రహ్మం.

తన కొడుకు చచ్చిపోయిన నాలుగైదు సంవత్సరాల కొక్క యిప్పుడు మాత్రమే చేబదులుకోసం పంపించింది, తన అక్క.

ఇంతమాత్రానికే యిక్కడ యీరంధి యెందుకో అతని కర్థం కాలేదు.

సుందరమ్మ కూడా యిలా పుటంకించడం బొత్తిగా అర్థం కాలేదతనికి; కాని ఆలోచనలో మాత్రం పడ్డాడు, దీంతో.

"అక్కడ డబ్బెప్పు డగత్యం అవుతుందో యిక్కడ వుండి—"

"నన్నంత చేతకానివాణ్ణి కింద కట్టేశావా తల్లీ?" అన్నాడతను, మాట సగంలో అందుకుని.

ములుకులా గుచ్చుకుంది మరి, ఆమాట.

"ఇక్కడి డబ్బంతా ముసలావిడ కాకినాడ తరలించేస్తోందనుకుంటున్నారు వీళ్ళు" అనుకున్నాడతను.

"ఎంత భ్రాంతి?" అనిన్నీ అనుకున్నాడు.

నవ్వు రాబోయింది; కాని "నీఅక్కకి యీపూళ్ళో—నీదగ్గిర చేబదులు పుచ్చుకోవలసిన కర్మం యేమిటోయ్ మరీ?" అని యెవరో అడుగుతున్నట్టయిందతనికి.

"దీనిమీద నీతల్లి అందుకోడం మాత్రం యెందుకూ, యిందులో కుట్ర లేకపోతే?" అని కూడా మరెవరో అడుగుతున్నట్టయింది.

"నిజమా?" అనిపించింది.

అది ఆలోచన రేపెట్టింది.

నెలకి రెండువేలకు పైగా సంపాదిస్తాడు, తన అక్క మొగుడు.

ఒక పల్లెటూరి ఆయకట్టులో సగం భూమి కూడా కొనేశాడు, వరసపెట్టి.

పైగా, పజిల్సులో కూడా డబ్బు కొట్టేస్తూ వుంటాడు, తరుచు.

ఇంతా చేసి వచ్చిందంతా అతను తన అక్క చేతిలో పోసేస్తాడు; కాని తన కని ప్రత్యేకంగా వొక పెట్టె అయినా లేదతనికి.

ఆమె యెందు కెంత ఖర్చుపెట్టినా అదేమిటనడు.

పోనీ అంటే, లక్షలమీద లక్షలు గుట్టలు పెట్టేస్తోంది, తన అక్క.

"మరి అలాంటి మనిషికి చేబదులా?"

"అందులోనూ నా దగ్గిరా?"

"ఇదేదో పన్నాగంలా లేదూ?"

"ముసలావిడే నడిపిస్తోందా యిదంతా?"

ఇలాగ సందేహం మీద సందేహం బయలుదేరిం దతనికి, దాంతో.

ఆవిడ సుందరమ్మని "కాకినాడ వెళ్ళిపోదాం ర"మ్మనడం జ్ఞాపకం వచ్చిందతని కీపునాదిమీద.

"నాడబ్బుతోనే సైనుపంచెలు కొని చిట్టితల్లిచేత కట్టిస్తుందా అక్క?" అనుకున్నా డీవూహతో.

వొణికిపోయాడు.

నిట్టూర్పు విడుస్తూ కళ్ళు మూసుకున్నా డప్రయత్నంగా.

అదిగో అది కాకినాడలో తన బావగారి మేడపోర్టికో.

ఒంటెద్దుబండి దింపి, రెక్కపట్టుకుని సుందరమ్మని లోపలికి తీసుకు వెడుతోంది తన తల్లి, ఇటు తిరిగి కళ్ళు చికిలించుకుంటూ.

దృశ్యం మారింది.

లోపల వంటింట పక్కగది.

మారుతాళంతో పెట్టె తెరిచి సుందరమ్మ జరీచీరలూ జాకెట్లూ తన మేనగోడళ్ళు—పర్వతవర్ధనీ, రామలక్ష్మి, సుభద్రా, వెంకుసోదెమ్మా పట్టుకు పోతున్నారు, పదండి పదండి అంటూ వొకళ్ళనొకళ్ళు గెంటుకుంటూ.

మళ్ళీ దృశ్యం మారింది.

"స్నానాలగదీ కొళాయీ మనకి పనికిరావు" అంటూ నుయ్యా, నూతిమీద చేదా చూపిస్తోంది సుందరమ్మకి, తన అక్క అత్తగారు, ధుమధుమలాడుతూ.

మళ్ళీ మారింది దృశ్యం.

"ఎందుకు వచ్చా రమ్మాయిగోరూ మీరీ నరకానికి? మీనాన్నగారికి బరువయిపోయారా మీరు? అనడుగుతోంది పనిమనిషి, బిక్కూ బిక్కూమంటూ

నూతిచాటున కూచుని వొళ్ళు తడుపుకుంటున్న సుందరమ్మని, అంట్లు తోముతూ తోముతూ, బెదిరిబెదిరి అటూ యిటూ చూస్తూ, కంఠం కూడా నొక్కుకుని, జాలిగా.

మళ్ళీ మారిపోయింది, దృశ్యం.

"దాచుకోండి, దాచేసుకోండి" అని కూతుళ్ళ నవతలికి పంపేసి వచ్చి, తడిబట్టతో వచ్చి తన పెట్టె చూసుకుని తెల్లపోతున్న సుందరమ్మకి సరికొత్త కోరాసైనుపంచె అందిస్తోంది తన అక్క, వికటంగా నవ్వుతూ.

చీకటిహాల్లో ఫిలింరీలు తిరిగిపోతున్నట్టు ఈదృశ్యాలు కనపడ్డాయి, మూసుకున్న ఆకళ్ళ కతనికి.

గుండెలు బద్దలాసిపోగా "ఇవ్వను ఇవ్వ" నంటూ మరీ వూగిపోయా డతను, పడకుర్చీ జవజవలాడేటట్టు.

"........................"

"నాన్నమ్మ యిమ్మంటుందే అనుకో. అయితే, నాకు తెలియదుటమ్మా అమాత్రం?"

"........................"

"చేబదు లంటే మళ్ళీ యిస్తుంది కదా అని నేను సరే అన్నమాట నిజమే, నాది బుద్ధితక్కువే, సందేహం లేదు"

"........................"

"పోనీ, యిప్పుడే కాదు, మరెప్పుడూ కూడా చిన్నత్తయ్య కొక్క దమ్మిడీ అయినా యివ్వను, సరా?"

ఇలా అడుగుతూ వుబ్బెత్తుగా లేచి కూచుని చెయ్యి పట్టుకున్నాడతను.

అప్పటికీ అతను వొణుకుతూనే వున్నాడు.

మాట కూడా గద్గదికమై వుంది.

"మీ డబ్బు మీ యిష్టంవచ్చినట్టు చేసుకుంటారు, నాకెందుకు నాన్నారూ, అదంతా?

"అదేమిటమ్మా, నువ్వు కూడా——"

"నే నేమన్నాను నాన్నారూ? నాకేం కావాలండీ యింక? బతకడానికి గుప్పెడు మెతుకులే కరువయిపోతాయా నాకు?"

నెత్తిమీద పిడుగు పడ్డట్టయిందతని కీమాటతో.

"మాఅమ్మవు కాదూ, యిక అలా అనకమ్మా కాకినాడ మాట మరిచిపో. నువ్వు తప్ప మా కింకెవరున్నారూ? నాన్నమ్మని నోరెత్తనివ్వనిక చూసుకో. ఇనప్పెట్టి తాళాలు నీకే యిచ్చేస్తాను పోసే. నువ్వు చల్లగా వుండాలి గానీ——"

అంటూ వొణుకుతూ వెళ్ళి, ఎడమచేత పొదివి పట్టుకుని కుడిచేత ఆమె గడ్డం పుణికాడతను.

"నేనేం తప్పమాట అన్నానని—"

"తప్పో వొప్పో—ఇక అది మరిచిపో. ఏం? దీపాలు పెట్టాటప్పటికి వస్తానను. అని మరీ వెళ్ళు"

"అక్కడి వీలు—"

"వీలంటే, మన యిష్టమే కాదుటమ్మా వెర్రితల్లీ! వచ్చెయ్యి ఏం?"

"వొంటరిగా కూచుని భోజనం చెయ్యడం నాకు మాత్రం—"

"ఇంకేం? అందుకే వచ్చెయ్య మంటున్నాను"

"అమ్మమ్మా తాతయ్యగారూ కూడా వస్తారక్కడికి మరి. వోపట్టాన అమ్మమ్మ నన్ను వదలదు. మీకే తెలుసు"

"నామాటగా చెప్పి నువ్వు వచ్చెయ్యి"

"........ఏడున్నర లోపున నేను రాకపోతే మాత్రం—"

"ఏడున్నరకాదు, ఎనిమిదిన్నర దాకా చూస్తాను. తప్పకుండా రాఅమ్మా ఇవాళ రెండో ఆటకి సినిమాకి వెడదాం"

"జానకమ్మ—"

"దాన్ని తీసుకుని నువ్వు సినీమాకే రా పోనీ, నే నక్కడే కనిపెట్టుకుని వుంటాను"

"....................."

"కళ్ళు మూసుకుని నేనిక్కడెలాగో నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని —"

"మీ రలా అంటే నాకక్కడ ముద్ద నోటికి పోతుందా నాన్నారూ?"

"అందుకే గా వచ్చెయ్య మంటున్నానూ?"

"....................."

"నేను మరీమరీ చెప్పానని చెప్పు జానకితో. గ్రేటాగార్బో నటించిన ఫిలిం, ఇవాళే మొదలు కూడానూ"

"ఆలస్యం—"

'అవు నవుతోంది మరి. జట్కా తీసుకురానా?"

"తీసుకురండి"

"రానూ పోనూ...."

"వద్దండి"

"నువ్వు భోజనానికి వచ్చే ప్రయత్నంలోనే వుండాలిసుమా!........పోనీ, ఏడున్నరకి టెన్నిస్‌కోర్టునుంచి నే నక్కడికే—"

"చాలా సంతోషిస్తుం దండీ చిన్నమ్మమ్మ"

"నాకూ చూడా లనే వుంది, జానకి కూతుర్ని"

"మరి, అమ్మ నిక్కడ వుంచేసి మీ రొక్కరే—"

"అవునమ్మోయ్, గట్టి చిక్కే"

"నన్నే కాదు, భోజనం చెయ్యకుండా మిమ్మల్నీ—"

"అదీ నిజమే. సరే, జట్కాకోసం వెడుతున్నాను"

తానుకూడా ఆమెతో పాటు జట్కా యెక్కా డతను.

"సోమాలమ్మ గుడివీధిని కాదు, బజారునుంచే పోనియ్యి, కూరల మార్కెట్టుదగ్గిర నేను దిగిపోతాను" అని జట్కామనిషికి చెప్పి మరీ యెక్కా డతను.

అక్కడ బండి దిగుతూనూ దిగిన్నీ కూడా మళ్ళీ చెప్పాడతను, తప్ప కుండా వచ్చెయ్య మని కూతురితో.

వస్తుం దని స్థిరపరుచుకుని ఇంతలో క్లబ్బు గాలి ముసురుకోగా, దర్జాగా టెన్నిస్‌బాటు తిప్పుకుంటూ, కూని రాగం కూడా తీసుకుంటూ టవునుహాలుకి వెళ్ళిపోయా డతను.

13

"ఏం, యింకా కనిపెట్టుకునే వుంటారా, యిప్పు డయినా భోజనానికి లేస్తారా?" అనడిగింది, భద్రమ్మ వచ్చి.

పడకకుర్చీలో పడుకుని వున్నాడు రామబ్రహ్మం, హాల్లో.

మాటిమాటికీ వీధిగుమ్మం కేసి చూస్తున్నాడు, కూడా.

వీధిలో జట్కా చప్పు డయితే "అదిగో వచ్చేసింది చిట్టితల్లి" అను కుంటూ, నిటాగ్గా కూచుంటూ, మళ్ళీ మళ్ళీ వాలిపోతూ సతమత మయిపోతున్నా డతను.

తనతల్లీ భార్యా కణ్ణా ఆడుకోడం—దాంతో, తన తల్లీ అక్కా తన బిడ్డ ప్రాణాలు కుచ్చులు పన్ను తున్నట్టు తన కనుమానం యేర్పడ్డం—అది అంజనం అయి చేబదులు కోసం కొడుకుని పంపిన తన అక్క దుశ్చింత తనకి పూర్తిగా అవగాహన కావడం—దీంతో తన యేకపుత్రికమీద మమకారం ముమ్మరం అయిపోయివుం దతని కప్పుడు.

ఏది యేమయిపోయినా ఆమె కే అపాయమూ రాకుండా చూసుకోవా లన్న శ్రద్ధ కూడా పుట్టుకువచ్చి వుం దతనికి.

అంచేతనే ఆమెని చూడా లన్న యాతహతహ.

కాక,—

ఎంత రాత్రయినాసరే, ఆమె వచ్చాక ఆమెని బంతిని కూచోపెట్టుకునే భోజనం చెయ్యా లని దీక్షపట్టా డతను.

సుందరి స్వయంగా అన్నం తినగలిగినప్పణ్ణుంచీ వుంది, అతనికీ యేక బంతి అలవాటు.

ఆమె బంతిలో లేనిపూట సగంసగమే అవుతుం దతని భోజనం.

దీనికి సాయం, తల్లీ పెళ్ళామూ సరిగా ఆసమయంలో కీచులాడుకోడం వల్ల మధ్యాహ్నం ఫలహారం సనిపడలే దతనికి.

కాగా, ఆకలీ యెక్కువగానే వుంది, ఆందోళనకు సాయం.

ధానా దీనా వొక్క ఆలోచనా నిలవడం లేదు, వొక్క నిశ్చయమూ రూపు కట్టడంలే దతనికి.

ఎటు చూసినా ముజ్జిడుగా కనపడుతోం దంతా.

అంచేత "యింకో అరగంట చూద్దాం" అన్నాడు.

"మీ యిష్టం" అంటూ గుమ్మం దాటింది భద్రమ్మ.

"అమ్మాయి రావడమే వస్తే తల్లితో కూచుని భోజనం చేస్తుం దీపూటకి, నువ్వు లేవరాదూ నాయనా" అనడుగుతూ వెంకుసోదెమ్మ చక్కావచ్చింది' వుత్తరక్షణాన.

ఉలిక్కిపడ్డా డతను, ముందు.

మండిపోయాడు తరువాత.

మాట్టాడకూడ దనుకున్నాడు; కాని "నీఫలహారం అయిందా?" అనడిగాడు, నోరు జారి.

"ఆ"

"వెళ్ళిపడుకో"

కదల్లే దామె.

అదే చిరాకు కలిగించగా "అక్క కేం చెప్పి పంపావ్?" అనడిగింది.

"ఏం చెప్పి పంపితే నీకేం?" అనా లని అతని వుద్దేశం; కాని "ఇప్పుడాసంగతి యెత్తకమ్మా" అంటూ వచ్చింది, మాట మళ్ళీ.

"ఏం?"

"వద్దన్నాను"

"ఏమ నడుగుతున్నాను"

చర్రు మనిపించిం దీమాట.

వల్లమాలిన రోషం వచ్చేసింది, దాంతో.

ఎగిసిపడి లేచినుంచోవలసినవాడే; కాని నిటాగ్గా మాత్రం కూచున్నాడు, కుర్చీలో.

"కోడలితో తగువు లాడ్డం చాలలేదూ?" అనిన్నీ అడిగాడు, కరుగ్గా.

"నే నేం తగువు లాడాను రా?"

"ఇప్పు డిదేమిటి పోనీ?"

"అక్క కేం చెప్పి పంపా వని అడిగితే తప్పా?"

"అవి నీ కనవసరం అంటే వినపడదూ?"

"అయ్యో, అయ్యో"

ఎంత గండ అయినా, మొగవాడు గట్టిగా నిలవదీస్తే చివరికిదే ఆడదాని ధోరణి.

అది గుర్తించి "యిప్పు డయినా వెళ్ళి పడుకో" అన్నా డతను, నిష్ఠురంగా.

అని మళ్ళీ కుర్చీలో వాలాడు, యిక మాట్టాడవ ద్దన్నట్టు.

ముసలమ్మకీ వచ్చింది రోషం, దీంతో.

"నీకు నీకూతు రెలాంటిదో నాకు నా కూతు రలాంటిది కాదుట్రా?"

"అయితే?"

"నీపెనిమిటి బతికివున్నంతకాలమూ నీకూతురి యెక్కువ, యిప్పుడు నాకూతురి యెక్కువ, తెలుసా?" అనుకుంది, తలుపుచాటున పొంచివుండిన భద్రమ్మ.

"మరి, తండ్రి ఆస్తిలో—" అంటూ అందుకుంది ముసలమ్మ.

"తండ్రిది కాదు, తాత ముత్తాతలది.

"ఆ?"

"మా నాయన కొత్త ఆస్తి యేమీ సంపాదించలేదు"

"ఉన్నది నిలిపారు చాలదూ?"

"స్వేచ్ఛగా తిన్నాడు. వొకళ్ళకి పెట్టాడు. పెట్టి తాళాలు నీకిచ్చాడు, నువ్వేం చేసినా చూసి వూరుకున్నాడు, చాలదూ?"

"అలాగా?"

"అప్పుడు నాయన అయితే, యిప్పుడు నేనూ పెత్తనదారుని, ఈఆస్తికి"

"ఆస్తి అంతా చిట్టితల్లిది, యిప్పటిమట్టుకి" అనుకుంది భద్రమ్మ, గుండెలమీద చెయ్యి వేసుకుని.

"బిడ్డ లంటే మొగబిడ్డలు—"

"మరి అక్కకి మాత్రం యేమి అధికారం వుందీ, పైతృకం మీద?"

"మహాబాగా అడిగారు" అనుకుంది భద్రమ్మ; కాని అత్తగారి మాటలో "నేను కనక మొగబిడ్డని కనగలిగాను, నీ పెళ్ళాం కనగలిగిందా మరి?" అన్న ధ్వని కనపడిం దామెకి.

చివుక్కు మంది మనస్సు.

అభిమానమున్నూ ముంచుకువచ్చేసింది.

ఉడుకుమోత్తనం, రోషం, దుఃఖమూ కూడా వచ్చాయి పురకలు వేసు కుంటూ; కాని "ఆడపుట్టక కాదు నీది" అంటూ జలదరించుకుంది, చివరికి.

"పుట్టింటి ఆశ—" అంటూ అందుకుంది ముసలమ్మ, యింతలో మళ్ళీ.

"ఆశకా దిది దోచుకుపోవా లన్న దుర్బుద్ధి" అనుకుంది భద్రమ్మ, పళ్ళు పటపట్లాడించుకుంటూ.

"ఆశకా దిది ద్రోహచింత" అన్నాడు రామబ్రహ్మం, అంతలో నిష్ఠురంగా.

"ఆ, ఆ, యేమన్నావు?" అంటూ కొయ్యయిపోయింది ముసలమ్మ. కాని "ఎన్నాళ్ళకి వినపడిందీ శుభమైన మాట" అనుకుంది భద్రమ్మ.

పొంగిన్నీ పోయింది, అనుకుని.

"ఎనిమిది న్నర కావస్తోంది, సినీమాకి వెడతానన్నారు గదా లేవరాదూ, యింకా స్నానం కూడా చెయ్యాలి?" అనడుగుతూ వెంటనే యె/|టికిన్నీ వచ్చేసింది మళ్ళీ, యేమీ యెరగనట్టు.

రగడ తప్పకపోతే అత్తగారిని "దులిపేద్దా" మనే వచ్చిందామె.

వెంకుసోదెమ్మ కూడా పరిస్థితులు గుర్తించలేకపోలేదు.

వీలు తప్పితే "చెలిగేదా" మనే నిశ్చయించుకుం దామె కూడా.

రామబ్రహ్మం మాత్రం తెల్లపోయాడు.

"ఏదో మూడుతుం దివాళ" అనిన్నీ అనుకున్నా డతను.

అంతే జరిగింది కూడా.

"మమ్మల్ని మాట్లాడుకోనివ్వవూ?"

"కొడుకుని భోజనం చెయ్యనివ్వవూ?"

"తలుపుచాటున పొంచివుండి—"

"వొంటరితనం కల్పించి మెడలు విరుద్దా మని—"

"ఏదో మందుపెట్టి నా కొడుకు మనస్సు విరిచేసి—"

"నాబిడ్డ గొంతుకోసి – వున్నదంతా కాకినాడ తరలిద్దా మని—"

"ఏముం దిక్కడ?"

"ఏముండనిచ్చావు నువ్వు?"

"ఆవాలు ముద్దచేశాను, కడుపు కట్టిపెట్టుకుని."

"అదంతా కాకినాడ దాటించా వెప్పటి కప్పుడు."

"నాకూతురి పన్నవాళ్ళు పురుగులోడి—"

"నన్నన్నవాళ్ళు ఛెడీ మని—"

"ఊరుకుంటారా లేదా?" అంటూ వురిమాడు రామబ్రహ్మం, అప్పటికి మాట తెచ్చుకునీ, యెగిసిపడి లేచి నుంచునీని.

భద్రమ్మ వెనక్కి తగ్గింది, అత్తగారిమీద మాత్రం నిప్పులు కక్కుతూ; కాని "పెళ్ళాన్ని వంచుకోలేనివాడవు నన్నాజ్ఞ పెట్ట చూస్తా వేమిషి రా వాజమ్మా" అంటూ యిటు తిరిగింది, ముసలమ్మ.

"వెళ్ళి పడుకుంటావా లేదా నువ్వు?"

"నేను వెళ్ళ నేం చేస్తా వేమిటి నువ్వు?"

బోసినోరు పాటించుకుంటూ తల్లి యిలా యెదురుకునే టప్పటికి అగ్గయి పోయాడు రామబ్రహ్మం.

కాని ఆమె నింటోకి పంపెయ్యా లంటే యేమి చెయ్యాలో తోచలే దతనికి.

పోనీ అంటే యెదట పెళ్ళాం.

ఇప్పు డూరుకుంటే తాను లోకు వయిపోతా డామెకి.

తన భర్త అప్రయోజకు డయినా సరిపెట్టుకుంటుంది, తన మాట వినక పోయినా సమాధానపడుతుంది; గాని, తనకి కాక, ఆమె యెవ రయినా, మరో స్త్రీకి లొంగిపోతే మాత్రం సహించలేదు, స్త్రీ.

భర్తది కాదు ఆ లొంగుబాటు, తనది అనుకుంటుం దామె.

అది పురుషున కపాయకరమైన సన్నివేశం.

ఇది బాగా తెలుసు రామబ్రహ్మానికి.

"పెళ్ళాం చేతిలో కీలుబొమ్మ అయిపోగూడదు నాయనోయ్" అన్న నోటితోనే "పెళ్ళానికి లోకు వయిపోగూడదురోయ్" అని కూడా తల్లే నూరి పోసింది, మరి అతనికి.

కనక?

తల్లినే మందలించా లని తేలింది.

ఆపని మాత్రం చెయ్యగలడా మరి, అతను?

ముందు నుయ్యా, వెనక గొయ్యా అయిం దతనికి.

అవ్యక్తము - అభిమానం, అప్రయోజకత్వం - రోషం, అశక్తత - ఆగ్రహం - యిలాంటి ద్వంద్వాలు విరుచుకుపడ్డాయి, దాంతో.

నిప్పులు కక్కుతూ చూశాడు, మొదట.

వాణికిపోతూ పరవళ్ళు తొక్కాడు, తరవాత.

"కొట్టుకుచావండి మీరిద్దరూ" అంటూ వీధిలో కుడాయించాడు, నేలమీద జీరాడుతున్న వుత్తరీయం బుజంమీదికి తీసుకుంటూ, చివరికి.

కొయ్యయిపోయింది ముసలమ్మ.

భద్రమ్మ మాత్రం మహిషాసురమర్దని అయిపోయింది.

"నాకూతురికి లేకుండా చేద్దా మని చూస్తున్నావు. నోటి దగ్గిరి అన్నం పడగొట్టావు కొడుక్కి. నువ్వు మనిషివి కావు. పురుగులోడిపోతావు నువ్వు. ఇదంతా నీకూతురికి కట్టికుడుపుతుంది" అంటూ చేతులు చాపుకుంటూ ముసలమ్మ మీద ధాంధూములు చేసి, గిరుక్కున మళ్ళి తలుపులు బిడాయించుకుంది, పడమటింటోకి వెళ్ళి.

14

కూనిరాగం తీసుకుంటూ అప్పుడే వచ్చాడు రామబ్రహ్మం సినీమా నుంచి.

భద్రమ్మ మేలుకునే వుందింకా.

అయితే, యేదో పోగొట్టుకున్నదానిలాగా, కట్టుళ్ళలో వున్న మనిషి లాగా మంచాన పడి అటమటించిపోతోంది, అటూ యిటూ దొర్లుతూ.

మొగుడు లోపలికి రావడం చూసింది; కాని లేవలేదు.

పలకరించనూ లేదు.

అతనే పలకరించాడు "వొంటిగంట అయింది నిద్రపట్టలేదూ యింకా?" అంటూ మీద చెయ్యివేసి.

"అలా పడుకోండి" అంటూ గోడవైపు జరిగిం దామె, అడిగినదానికి బదులు చెప్పకుండా.

ఉనికిలోనే కాక ఆమె మాటలో కూడా దిగులూ, దిగులు కంటే విసుగూ విసుగుకంటేనూ కూడా బాధా యెక్కువగా కనపడ్డా యతనికి.

నిర్విణ్ణు డయినాడు.

"మళ్ళీ రగడ జరిగిందా?" అనిన్నీ అనుకున్నాడు.

చూసిచూసి "అలా వున్నా వేం?" అనడిగాడు చివరికి, యెటూ పాలుపోక.

"ఉండవలసినట్టే వున్నాను"

"భోజనం——"

"చెయ్యనిచ్చే పట్టే పట్టిందా మీ మాతృదేవత?"

"నువ్వు చేస్తే కొడుతుందా?"

"పెనిమిటిని పస్తుపెట్టి కడుపు విచ్చేలా తినేది కామోసు మీఅమ్మ, మేము నేర్చుకోలేదలాంటి వింకా"

"పస్తు కర్మ మేమీ? నేను హొటల్లో—"

"కట్టుకున్న పెళ్ళాం యింటో మాడిపోతూ వుంటే హొటల్లో—"

"స్స్"

"ఉన్నవూళ్ళో—సొంత యింటో—సిద్ధాన్నం విడిచి హొటల్లో తినడం మావూళ్ళో కూడా యెవరూ యెరగరు"

"........."

"రాజమహేంద్రవరంలోనూ, మళ్ళీ మీయింటోనూ మాత్రమే చెల్లిందది"

"........."

"చిట్టితల్లి రాలేదు కనక సరిపోయింది, వచ్చేవుంటే అది కూడా కడుపు మాడ్చుకో వలసిందే కదా, మీఅమ్మ ధర్మమా అని?"

"నేను వెళ్ళాక మరేమయినా గందరగోళం—"

"మీ అమ్మ నోరూవాయీ లేని దని కామోసు అక్కడికి"

"........."

"ఆవిడ కందలో కంద మీరు మీ కామె చేసిన వల్లా బాగానే వుంటాయి గానీ—"

"ఏం చేసిందీ?"

".... ...."

"పోనీ, యేమందీ?"

".... ...."

"చెప్పవూ?"

ఇలా అడుగుతూ అమె గడ్డం పట్టుకున్నా డతను.

అప్పటికీ బదులుచెప్పలే దామె,

వెంటనే మంచంమీద కూచుని ఆమె మీదుగా వంగి అవతలి వైపున చెయ్యి అనుకుని, మొగాన మొగం వుంచి "చెప్పవూ? నాగుండె లెలా కొట్టుకుంటున్నాయో చూడూ" అంటూ ఆమె చెయ్యి తన గుండెలమీదికి తీసుకుని నొక్కుకున్నాడు.

"చెయ్యి వదలండి"

"నన్నేడిపిస్తావా?"

"ఏడ్చేదాకా మీకేం?"

"నీకు మాత్రం యేమి వచ్చిందీ?"

"పుట్టిన వొక్కపిల్లా మోడయిపోయి, దుఃఖదేవతలాగ వుసూరుమంటూ కళ్ళ యెదట మసులుతూ వుంటే కన్నతల్లి కడు పెంత తరుక్కుపోతుందో—"

"అదంతా నిజమే; కాని యివాళ కొత్త యేమి వచ్చిందీ?"

"ఇది పాతపడ్డం అంటూ వుందా?"

" . . . ."

"మనిషి జన్మ యెత్తినవాళ్ళకి మరుపువచ్చే దేనా యిది?"

" . . . ."

"పురిటిలో చచ్చిపోతే వొక్కటే యేడు పయిపోయి వుండును. ఇప్పు దేషణాని కాక్షణమే కత్తికోత"

"........................"

"నాకళ్ళు దించుకుపోతే బాగుండిపోవును"

"చేసుకున్న దంతా—"

"ఒకళ్ళు చేసిందా, స్వయంగా చేసిందా?"

"ఏమయినా వొకటేగా అనుభవానికి వచ్చినప్పుడు?

"అనుభవిస్తూనే వున్నాంగా నేనూ చిట్టితల్లీ నీ?"

".......... ...."

"ఆచీర కట్టుకుని నానగలూ తన నగలూ పెట్టుకుని అద్దం యెదట నుంచుని సవరించుకుంటూ వుంటే చూడలేకపోయాను, చిట్టితల్లిని. గిర్రున నీళ్ళు నిండిపోయాయి కళ్ళల్లో"

ఈమాటతో అతని కళ్ళూ చెమ్మగిల్లా యిప్పుడు.

"ఇక అక్కడ నుంచుకోలేకపోయాను. అమ్మా, 'వెడుతున్నానే' అంది, గుమ్మం దాక సాగనంపడాని కయినా కాళ్ళాడలేదు. వెళ్ళిరా అని మాట అయినా—"

"నా పనీ అలాగే అయిం దక్కడ బాటు పట్టుకువెళ్ళానే గాని వొక్కమాటయినా బంతి తియ్యలేకపోయాను, సరిగా. బలమే లేకుండా పోయింది చేతిలో"

"................"

"మూడు పావులాలు చెల్లించి పీటమీద కూచున్నానే గాని వొక్క మెతు కయినా నోటికి పోలేదు, హోటల్లో"

"దీపాలు పెట్టాక తలనిండాపెట్టి, మెడనిండా వేసి కళ్ళనిండా చూసుకుందా మని బుట్టెడు మల్లెమొగ్గలు కొన్నాను. వీరభద్రాపురం నుంచి

పార్వతమ్మపిన్ని వచ్చి పిలిచిం దంతలో. ఆదరా బాదరా చిన్నదండ గుచ్చి తలలో పెట్టుకుని చక్కాపోయింది, అమ్మ"

"..............."

"మొగ్గ లన్నీ అలాగే వుండిపోయాయి"

"..............."

"అది శుభకార్యం కోసం వెడుతూ వుంటే, తల్లి నయి వుండిన్నీ వెంట వెళ్ళలేక యింటో పడి మగ్గిపోతున్నాను నేను. నిశ్చింతగా హోటల్లో భోజనం చేసి, దర్జాగా సినీమాకి వేళ్ళి, కులాసాగా కూనిరాగం తీసుకుంటూ, కమ్మగా నిద్రపోడానికింటికి వచ్చారు మీరు, నా బాధ మీకేం తెలుస్తుందీ?

'నే నెంత యేడుస్తున్నానో—

"మీరా?"

"..............."

"దుఃఖమా మీకు?"

"..............."

"అమ్మమాట విని కన్నబిడ్డ బతుకు ధ్వంసం చేశారుమీరు. నాకడుపులో రాయి పడేశారు, అక్కని ఆనంద పెట్టడానికి. ఇదంతా నవ్వుతూ చేశారు మీరు, నేను మరిచా ననుకున్నారా?"

"..............."

"దుఃఖానికి బదులు శాంతీ, నిరాశకి బదులు వెలుగూ సంపాదించు కుందా మని చదువుకుంటూ వుంటే అమ్మాయి ప్రాణాలు కూడా తీద్దా మని కాకినాడనుంచి వుత్తరాలమీద వుత్తరాలు తెప్పిస్తోంది మీఅమ్మ, పోనీ అంటే, ఆవుత్తరాలు పట్టుకుని వూరేగుతున్నారు మీరు, నేను చూడ్డం లేదా?"

"ఊరేగుతున్నా నంటే—"

"ఇదంతా యేడుస్తూ చేసే పనా, నవ్వుతూ చేసే పనా?"

"అమ్మాయిమీద నా కెంత ప్రేమ—"

"ఏమిటీ?" అంటూ చర్రున సగం లేచింది భద్రమ్మ, గోడవైపున వున్న మొగం యిటూ తిప్పుకుంటూ.

చుట్టచుట్టుకుని పడుకుని వున్న నల్లతాచు, మనిషి అలుకుడు విని బుస్సు మంటూ పడగ విప్పి తల యెత్తిన ట్టుంది, ఆమె వాలకం.

"పోనీ నీకే వుంది ప్రేమ, సరే. మరి ప్రయోజనం?"

"హయ్యో, దేవుడ! లక్షమా ట్లన్నారు మీ రిప్పటికి చదువుకుంటే ప్రయో జనం యేమిటని, యిదెక్కడ ధోరణండీ?"

"లోకనిందకి జడిసి—"

"పాడులోకం అమ్మాయిని ఆడిపోసుకోడం తప్ప మరి పనిలేదూ దానికి?"

"................"

"ఎంతోమంది అధీనం తప్పిన తమ కూతుళ్ళకు మళ్ళీ పెళ్ళిళ్ళు చేసి—"

"నిజమే, చేస్తున్నారు"

"వారి నేం చెయ్యగలుగుతోందీ ఆలోకం?"

"........ ...."

"మీకు మాత్రం యెందుకూ వారికి లేని భయం?"

"కొంప మునిగిపోదూ?"

"ఇది మునిగిపోడం కాదుటండీ?"

"................"

"పోనీ, మీ రేమీ చెయ్యనక్కరలేదు దానిమానాన అది వెళ్ళి పెళ్ళి చేసుకుంటుంది, వొప్పుకోండి"

"వొప్పుకోమంటే—"

"దాన్ని మీయింటికి తీసుకురా నక్కరలే దిక. ఒక దమ్మిడీ అయినా పెట్టనక్కరలేదు. దానికేసి చూడ నైనా చూడనక్కర లేదు, సరా?"

"................"

"తన యిష్టంవచ్చిన పిల్లాణ్ణి పెళ్ళిచేసుకుంటుంది. కలో గంజో తాగుతూ తన బతు కది బతుకుతుంది, ఏం?"

"అన్నీ హిరణ్యాక్షవరాలే నీవి"

"మరి, మీ అమ్మవి?"

"................"

"ఇలా చూడండీ మంచి వయసు వచ్చింది. చదువున్నూ వంటబట్టింది. అందచందాలు తెలిశాయి. తోటి పిల్లల సుఖమూ ఆనందమూ చూసి తన కవి లేకపోయాయే అని కుమిలిపోతోంది, దాంతో. అలాంటి బిడ్డని "ఇంకా కుమిలిపో, ఏడ్చుకుంటూ మూలపడి వుండు" అనడానికి నోరెలా వస్తుం దండీ మీకు?"

"................"

"పుట్టగతులు చూసుకోవద్దూ?"

"................"

"ఏం, బదులు చెప్ప డాని కయినా తగనూ నేనూ?"

"........."

"అవును, ఆ అమ్మ కొడుకులు కారూ?"

"......................"

"ఆ అక్క తమ్ములున్నూ కారూ?"

అప్పటికీ మాట రాలే దతనికి.

ఇక్కడ యిదిలా వుండగా దూరాన బాండువాద్యం.

ఆగిఆగి మధ్యమధ్య కమ్మని సన్నాయిపాట.

చూసి చూసి "మాట్టాడ రేమండి?" అంటూ రెక్క పట్టుకుని కుదుపుతూ అడిగిందామె, అతణ్ణి.

"అమ్మాయిని చూడాలేను, లోకనింద సహించాలేను"

"అది యింటో వుంటే చూడకతప్పతుందా?"

"......................"

"ఏక్షణాని కాక్షణం గుడ్లు పేలిపోవూ?"

"ఇప్పుడు గుండెలు బద్దలాసిపోడం లేదనా నీవూహ?"

"నిజంగా?"

"వొట్టు" అందా మనుకున్నాడు మొదట; కాని "ఛా" అనుకున్నా డంతలో.

"ఏడుస్తూ కూచుంటోం దది మీబంతిని, తెలుసా?"

"......................"

"కమ్మగా ఎలా భోజనం చెయ్యగలుగుతున్నా రండీ మీరు?"

"......................"

"మనుమడు చచ్చినందు క్కాదు, అమ్మాయి బతికివున్నందు కేడుస్తోంది మీ అమ్మ, ఇదయినా తెలుసా మీకు?"

"అంతమాటే?"

"కాక?"

"ఈకాలపు వేషాలు చూడలేక—"

"మరి నేను చూడగలనా ఆకాలపు వేషాలు?"

"......................"

"పయి సంబంధం అయి వుంటే అమ్మాయిమీద యింత పగపట్టునా మీఅమ్మ?"

"నిజమేనా?" అనిపించిం దతనికి.

"అవు" నన్నట్టతని తల కంపించింది, అప్రయత్నంగా.

అది గుర్తించి యెగిసిపడి లేచి కూచుని అందుకుంది భద్రమ్మ.

"నామాట వినండి. ఎప్పటి లాగే అది యింటో తిరుగుతూ వుంటే మనకీ యాతన తప్పదు. అలా కాక, మనకి కనపడకపోయినా, మళ్ళీ పెళ్ళి చేసుకుని యెక్కడో వొకచోట అది సుఖపడుతోందంటే మన కదొక నిబ్బర్రమూ అదొక ఆనందమూను"

"........................"

"అవునా కాదా?"

"నిజమే___"

"అవునా కాదా? అది చెప్పండి"

"అవును కానీ___"

"ఇక కానీ యెందుకూ మళ్ళీ?"

"అమ్మాయిని విడిచి వుండగలమా మనం?"

"అది యిక్కడ యేడుస్తూ వుంటే నిశ్చితంగా వుండగలం. అది మగ్గిపోతూ వుంటే దర్జాగానూ వుండగలం"

"ఇప్పుడీ ధోరణి యేమిటి నీకు, కొత్తగా?"

"సింగారించుకుని యెదట నుంచుంటే కళ్ళు జిగాలుమని పోయాయండీ నాకు"

"........................"

"అచ్చంగా పెళ్ళికూతు రయిపోయిందండీ, చిట్టితల్లి"

"....నీమాటలు బాగా వినపడ్డం లేదు, ఆబాజా లేమిటో వెళ్ళిపోనియ్యి"

భద్రమ్మ మనస్సు గుబగుబలాడిపోయింది.

మొగం విరిసింది.

కళ్ళు ఆనందోత్పుల్లా లయిపోయాయి.

15

"ఏదో వుత్సవం మనవీధికే మళ్ళినట్టుంది చూద్దామా?" అనడిగా డతను, ఆమె చెవి దగ్గిర నోరుపెట్టి.

జవాబు కోసం చూడకుండా, పొదివి పట్టుకుని ఆమెని కిందికి దింపాడు కూడా.

వొక్క అడుగున్నూ వేశారు, ముందు కలాగే వుండి, యిద్దరూ.

సరిగా యీసమయాన గది తలుపులు జవజవలాడిపోయాయి.

"అబ్బాయోయ్! నాయనోయ్! కొంప మునిగిపోయిందిరోయ్! సుందరమ్మ గొంతుక్కోసేసిందిరోయ్!" అంటూ బొబ్బలున్నూ వినవచ్చాయి.

కంగారుపడుతూ తలుపు తీశాడు రామబ్రహ్మం.

చూడగా "లబోలబో"మని మొత్తుకుంటూ వెంకుసోదెమ్మ.

"ఏమిటమ్మా?"

"ఇంకా యేమిటమ్మా అంథా వేమిషి రా వాజమ్మా? రారా కిందికి రారా, అప్రయోజకుడా!"

కొయ్యయిపోయాడతను.

తల్లి లాక్కుపోగా కిందికిన్నీ వెళ్ళిపోయా డాస్థితిలోనే.

రెండోవైపు తలుపులు తెరిచి బాల్కనీలోకి వుడాయించింది భద్రమ్మ, పొంగిపోతూ, వుత్తరక్షణంలో.

అంతలో నాలుక కరుచుకుంటూ వెనక్కి వచ్చి మల్లెమొగ్గల బుట్ట పుచ్చుకుని మళ్ళీ వెళ్ళిపోయింది, బాల్కనీలోకి.

రామబ్రహ్మం కిందికి వెళ్ళి చూడగా, స్త్రీలూ పురుషులూ కలిసి వీధినిండా పెళ్ళివారు.

గుమ్మానికెదురుగా—బాల్కనీకిన్నీ కిందుగా చక్కని మోటారు.

వెనక సీటులో పెళ్ళికూతురూ పెళ్ళికొడుకూ, ముందు సీటులో డ్రయివరు పక్కన వృద్ధదంపతులూను.

మనసు బిగపట్టుకుని పరకాయించగా, పెళ్ళికూతురు సుందరమ్మా, పెళ్ళికొడుకు ఆమె ట్యూటరు కృష్ణశాస్త్రిని.

వృద్ధదంపతులున్నూ యెవరో కారు, భద్రమ్మ తల్లీ తండ్రీనీ.

నిలువునా నీరయిపోయాడు రామబ్రహ్మం.

తిడుతూ కృష్ణశాస్త్రిమీది కురకబోయింది ముసలమ్మ; కాని యిలాంటిది జరగవచ్చునని సైనికుల్లాగ బాణాకర్రలతో పక్కని వరాసగా నుంచుని వున్న కాలేజీ విద్యార్థులు, తీసుకుపోయి ఆమెను హాల్లో కూలవేశారు.

అది చూసిన్నీ కదల్లేకపోయాడు రామబ్రహ్మం.

ఒక్క క్షణం వాద్యాలాగిపోయాయి.

వెనకమోటారులోంచి నలుగురు యువతులు దిగివచ్చి వధూవరులకు కర్పూరహారతి యిచ్చి పక్కల కోసిరిల్లారు, ఆసమయాన.

ముసిముసిగ్గుతోనూ, మొలకనవ్వులతోనూ పైకి చూస్తూ పెళ్ళికూతురూ పెళ్ళికొడుకూ చేతులు జోడించుకున్నా రప్పుడు.

దేవతలు పుష్పవర్షం కురుస్తున్నట్లు, పైనుంచి, మోటారు నిండా అరవిచ్చిన మల్లెపూలు పడ్డాయి, వెంటనే.

(1935 జనవరి ప్రబుద్ధాంధ్ర నుంచి
సవరణలతో)